
దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ

| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 7 | ది. 3-4-2026 | శుక్రవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 7 | Date : 3-4-2026 | Friday | Pages : 8 | Rs.1/- |


# అమరావతికి పార్లమెంట్ చట్టం...తిరుగులేని శాసనం

- బిల్లు ఆమోదంతో ప్రజా సంకల్పానికి గౌరవం
- రాజధానికి వ్యతిరేకంగా వాకౌట్ చేసిన వారిని బ్లాక్ అవుట్ చేయాలి
- మావిగన్ అంటూ రాజధానిపై అపహాస్యమా.?
- అమరావతి రైతులతో సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- సతీసమేతంగా దీపహారతిలో పాల్గొన్న ముఖ్యమంత్రి
- ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా, బిల్లుకు మద్ధతు తెలిపిన పార్టీలకు ధన్యవాదాలు తెలిపిన సీఎం







**అమరావతి,ఏప్రిల్ 2 (వార్తాప్రభ) :** అమరావతి రాజధానిగా చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటులో తిరుగులేని శాసనం చేశారని.. ఇది ప్రజా సంకల్పానికి దక్కిన గౌరమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతి బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. రాజధానికి శంకుస్థాపన చేసిన ఉద్దండరాయునిపాలెం వద్ద గురువారం రైతులతో కలిసి సతీ సమేతంగా అమరావతికి దీపహారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."దేశ చరిత్రలో అమరావతి విజయం సువర్ణ అక్షరాలతో లిఖించదగింది. అమరావతి చరిత్ర శాశ్వతం.. అందులో రైతులు చేసిన త్యాగం శాశ్వతం. అనేక కుట్రలను ఎదుర్కొని రాజధానిని దక్కించుకున్నాం. రాజధానిని స్మశానం అన్న వారు నేడు అడ్రస్ లేకుండా పోయారు. అమరావతిపై పార్లమెంటులో తిరుగులేని శాసనం చేసుకున్నాం. ఇప్పటి వరకు రాష్ట్రానికి అడ్రస్ లేదు, కానీ నేడు ఒక శాశ్వత అడ్రస్ వచ్చింది. అమరావతి రాజధాని ఆంధ్రుల ఆత్మగౌరవానికి చిహ్నం. 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చి చేసిన త్యాగం వల్లే ఈ విజయం సాధ్యమైంది. 1,631 రోజుల ఉద్యమం ఒక చరిత్ర. ఉద్యమాన్ని అడ్డుకున్న ప్రభుత్వంపై రాజధాని రైతులు, మహిళలు వీరత్వం, ప్రతాపం చూపారు. నాడు ముళ్ల కంచెలు దాటుకుని ఉద్యమం చేస్తున్న రైతుల వద్దకు పవన్ కళ్యాణ్ వచ్చారు. భువనేశ్వరి తన చేతికి ఉన్న రెండు గాజులను రాజధాని రైతుల ఉద్యమానికి విరాళంగా ఇచ్చారు. ఎంతో మంది రైతులకు అండగా నిలిచారు. అమరావతి ఉద్యమం కోసం నేను స్వయంగా జోలె పట్టాను. న్యాయస్థానం టు దేవస్థానం కార్యక్రమాన్ని నాటి ప్రభుత్వం అడ్డుకుంది. ఒక్క అడుగూ వెనక్కుక తగ్గినా... తర్వాత పది అడుగులు వేసి సింహాల్లా దూకారు. 2024లో కూటమి పార్టీకి అద్భుత విజయం అందించారు... ఇప్పుడు రాజధానికి చట్టబద్ధత కలిగింది. రైతులు, రైతు కూలీలు, ప్రజల ఐకమత్యం వల్లే ఈ విజయం సాధించుకున్నాం. 2019లో ఏమార్చారు. ఐదేళ్ల పాటు చీకటి రోజులుగా రాష్ట్రానికి దాపురించాయి. ప్రజావేదిక విధ్వంసంతో ప్రారంభమైన చీకటి రోజులు ముగిశాయి."అని ముఖ్యమంత్రి అన్నారు.

**తెలుగు జాతి గౌరవం అమరావతి..** "అమరావతికి అపజయం లేదు... అన్ స్టాపబుల్. ప్రజా రాజధానిని సాధించుకున్నాం. ఇది ప్రజా విజయం. ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన ప్రధానికి ధన్యవాదాలు. హోం మంత్రి అమిత్ షా సహా కేంద్రం, దేశవ్యాప్తంగా అన్ని పార్టీలు ఈ బిల్లుకు సహకరించాయి. పవిత్రమైన మట్టి-నీటిని రాజధాని శంకుస్థాపన చేసిన రోజున ప్రధాని తెచ్చారు. పార్లమెంట్ వద్ద ఉన్న పవిత్ర మట్టిని... పవిత్ర యమునా నది జలాలతో పునీతమైన పుణ్యభూమి ఇది. దేశం మొత్తం అమరావతికి అండగా ఉంటుందని నాడే ప్రధాని మోదీ చెప్పారు. ఆదర్శ రాజధాని తెలుగు జాతి గుండె, జాతి గౌరవం అమరావతి. ఓ ప్రాజెక్టుకు రెండు సార్లు ప్రధాని రావడం అమరావతి పనుల విషయంలోనే జరిగింది. అమరావతి నిర్మాణాలు పూర్తి అయ్యాక మరోమారు ప్రధాని ప్రారంభోత్సవాలకు వస్తారు. ప్రపంచంలోని ప్రతీ అభివృద్ధి మోడల్ అమరావతికి తెస్తాను. అమరావతికి శాశ్వతత్వం తెచ్చినందుకు ఇవాళ నాకు చాలా సంతోషంగా ఉంది. పార్లమెంటులో చేసిన చట్టాన్ని ఎవరూ మార్చలేరు. ఇప్పటి వరకు రాష్ట్రానికి అడ్రస్ లేదు..ఇప్పుడు మనకు ఓ అడ్రస్ వచ్చింది. వివిధ ప్రముఖ దేవాలయాల్లో పూజలు నిర్వహించి.. నాడు శంకుస్థాపన చేశాం. ప్రధాని మోదీ తెచ్చిన పవిత్ర మట్టి-నీటితో పునీతమైన ఈ భూమిపై ప్రపంచ స్థాయి నగరాన్ని నిర్మిస్తాం. రాష్ట్రంలో ప్రతీ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని అమరావతి సాక్షిగా ప్రజలకు హామీ ఇస్తున్నా."అని ముఖ్యమంత్రి ప్రకటించారు.

**అమరావతిని చంపాలనుకున్న పార్టీ పీడ విరగడవ్వాలి..** "ఒక్క వైసీపీ మినహా దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు అమరావతికి ఇవాళ అండగా నిలబడ్డాయి. అమరావతిని స్మశానం అన్నారు కానీ ఇవాళ పార్లమెంటులో అమరావతికి తిరుగులేని శాసనం చేసుకున్నాం. రాజధానితో మూడు ముక్కలాట ఆడారు... అడ్రస్ లేకుండా పోయారు. అమరావతి విషయంలో ఇంత జరిగినా వైసీపీకి మాత్రం బుద్ది రాలేదు. వారి పిచ్చి ఇంకా ముదిరింది. అమరావతికి చట్టబద్ధత కల్పించే అంశంపై తీర్మానం పెడితే ఆ పార్టీ అసెంబ్లీకి కూడా హాజరు కాలేదు. పార్లమెంటులో చట్టం చేస్తుంటే.. వాకౌట్ చేసింది. వాకౌట్ చేసిన ఆ పార్టీని ప్రజలు బ్లాక్ అవుట్ చేయాలి. అమరావతిని చంపాలనుకున్న వైసీపీ బాగుపడదు. ఇంతటి నీతిమాలిన రాజకీయం నా చరిత్రలో చూడలేదు.

## అనిశ్చితికి తెరపడింది.. అమరావతి ఏకైక రాజధానిగా నిలిచింది : డిప్యూటీ సీఎం పవన్



**విజయవాడ,ఏప్రిల్ 2 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే కీలక బిల్లు రాజ్యసభలోనూ ఆమోదం పొందింది. లోక్‌సభలో ఇప్పటికే ఆమోదం పొందిన ఈ బిల్లు, గురువారం పెద్దల సభలోనూ నెగ్గడంతో అమరావతికి రాజధానిగా తిరుగులేని చట్టపరమైన హోదా లభించింది. ఈ చారిత్రక పరిణామం పట్ల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఇది ఐదు కోట్ల ఆంధ్రుల విజయమని, ప్రజల ఆత్మగౌరవ పునరుద్ధరణ అని ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. "త్యాగాల పునాదుల నుంచి, ఆశలు మోసుకొచ్చిన కన్నీటి నుంచి, అనిశ్చితిని భరించిన నిశ్శబ్దం నుంచి అమరావతి నేడు కోట్లాది ప్రజల ఆశలను మోస్తూ గౌరవంగా నిలబడింది" అని భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. గత కొన్నేళ్లుగా రాజధాని ఉనికిపై సాగిన కుట్రలు, అపోహలు, న్యాయపరమైన చిక్కులను అధిగమించి, పార్లమెంట్ సాక్షిగా అమరావతి ఒక అజేయ శక్తిగా అవతరించిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఎట్టకేలకు న్యాయం జరిగిందని, ఈ విజయం ఎన్డీఏ ప్రభుత్వంపై చెక్కుచెదరని విశ్వాసం ఉంచిన ప్రతి పౌరుడిదని తెలిపారు. అమరావతి ఆత్మ రైతుల త్యాగంలోనే ఉందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. "33,000 ఎకరాలకు పైగా భూములను రైతులు బలవంతంగా ఇవ్వలేదు. భవిష్యత్‌పై, ఒక దార్శనికతపై నమ్మకంతో ఇచ్చారు. ఈ రోజు వారి నమ్మకాన్ని గౌరవించగలిగాం" అని పేర్కొన్నారు. ఈ చారిత్రక ఘట్టంలో రాష్ట్రానికి గుర్తింపు కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఆయన నివాళులు అర్పించారు. గత కొన్నేళ్లుగా అమరావతిని అనిశ్చితిలోకి నెట్టారని, విధానాలు మార్చి రైతులను మోసం చేశారని, ప్రజల ఆకాంక్షలను నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఇచ్చిన తీర్పుతో ఆ అనిశ్చితికి తెరపడిందన్నారు. ఇది కేవలం రాజధాని పునరుద్ధరణ మాత్రమే కాదని, ప్రజల ఆత్మగౌరవ పునరుద్ధరణ అని పేర్కొన్నారు. స్పష్టమైన దార్శనికతతో అమరావతి అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ప్రతి కీలక సమయంలో రాష్ట్రానికి అండగా నిలిచిన ప్రధాని నరేంద్ర మోదీకి, ఎన్డీఏ ప్రభుత్వానికి, బిల్లుకు మద్దతిచ్చిన అన్ని రాజకీయ పార్టీలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై అమరావతి స్థిరత్వం, ప్రగతికి చిహ్నంగా, తరతరాలకు వారధిగా నిలిచే ప్రజల రాజధాని అవుతుందని పవన్ కల్యాణ్ ధీమా వ్యక్తం చేశారు.

## ప్రజారాజధానిగా అమరావతి

- అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం పట్ల హర్షం వ్యక్తం చేసిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి,ఏప్రిల్ 2 (వార్తాప్రభ) :** అమరావతి చట్టబద్ధత బిల్లును పార్లమెంట్ ఉభయ సభలు ఏకగ్రీవంగా ఆమోదించడం పట్ల వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేస్తూ, ఇది రైతుల త్యాగాలకు న్యాయం చేసిన చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. ప్రజారాజధాని అమరావతి కోసం 29 వేల మంది రైతులు స్వచ్ఛందంగా 33 వేల ఎకరాల భూమిని ఇచ్చి దేశంలోనే అరుదైన ఉదాహరణగా నిలిచారని తెలిపారు. 1600 రోజుల పాటు నిరంతర పోరాటం చేసిన రైతులు, మహిళల ఉద్యమానికి ఆయన సెల్యూట్ చేస్తూ, ఉద్యమ సమయంలో మహిళలను సైతం వదలకుండా జరిగిన దాడులు ప్రజాస్వామ్యానికి మచ్చగా నిలిచాయని తీవ్రంగా ఖండించారు. గత 12 ఏళ్లుగా రాజధానిపై కొనసాగిన అస్పష్టత రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులపై తీవ్ర ప్రభావం చూపిందని, మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని రాజధాని లేకుండా చేసిన గత ప్రభుత్వ విధానాలను ప్రజలు తిరస్కరించారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు వైసీపీ అమరావతికి మద్దతు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పిన వైఖరిని ప్రజలు గట్టిగా ఎదుర్కొన్నారని, ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించే కుట్రలను ప్రజలు తిప్పికొట్టారని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో అమరావతి ప్రపంచ స్థాయి రాజధానిగా అభివృద్ధి చెందేందుకు పునాది పడిందని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వికసిత్ భారత్ సంకల్పం రాష్ట్ర అభివృద్ధికి బలమైన దిశను చూపుతోందని తెలిపారు. అమరావతి కేవలం రాజధాని మాత్రమే కాదని, ఇది ఐదుకోట్ల ఆంధ్రుల గుండెచప్పుడు, రైతుల త్యాగాలకు ప్రతీక అని స్పష్టం చేశారు.


**మహారాజశ్రీ కృష్ణా జిల్లా మచిలీపట్నం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

E. P. No. 105 / 2025
in
O. S. No. 365 / 2019

Between:
రాజనాల ఫణిబాబు
------D.Hr/వాది
మరియు
వేమవరపు శ్రీనివాసరావు
------J.Dr /ప్రతివాది

TO:
**J.Dr / ప్రతివాది అడ్రస్ :**
వేమవరపు శ్రీనివాసరావు , S/o.(లేటు)మాధవరావు, C/o.మచిలీపట్నం, సింగరాయపాలెం, ముదినేపల్లి మండలం, కృష్ణా జిల్లా.

పై నెంబరు E.P. 105 /2025 in O. S. 365 /2019లో J.Dr/ ప్రతివాది అయిన మీకు నోటీసు నిమిత్తం ది 22.04.2026 నకు వాయిదా అయియున్నది. కావున సదరు వాయిదారోజున ఉదయం గం. 10.30ని. లకుపై కోర్టు వారి యెదుట మీరు స్వయంగా గానీ లేదాన్యాయవాది ద్వారా గానీ హాజరైమీకు గల ఆక్షేపణలు తెలుపు కొనగలరు. లేని యెడల మీపరోక్షమున తదుపరి గ్రంధములు జరిపించబడునని ఇందుమూలంగా తెలియ చేయడమైనది.

**(శ్రీకోర్టు వారి ఉత్తర్వులప్రకారం)**

**పేర్ని సురేష్ బాబు**
D.Hr/ వాది తరపున న్యాయవాది, మచిలీపట్నం.


## మద్యం అమ్మకాల్లో గణనీయ వృద్ధి.. బీర్ విక్రయాలు 70% పెరుగుదల

### -అమ్మకాల లెక్క ఘనంగా ఉన్నా ఆదాయం పెరుగుదల స్వల్పమే



**అమరావతి, ఏప్రిల్ 2 (వార్తాప్రభ) :** 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో మద్యం అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. ముఖ్యంగా బీర్, ఐఎంఎల్ విక్రయాలు భారీగా పెరగడంతో మొత్తం అమ్మకాల విలువ 6.11 శాతం పెరిగింది. అయితే ధరల మార్పులు, ఇతర ఆదాయ వనరుల తగ్గుదల కారణంగా మొత్తం రెవెన్యూ పెరుగుదల మాత్రం కేవలం 0.68 శాతం మాత్రమే నమోదు అయ్యింది. ముగిసిన ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుండి మార్చి 31 వరకు గణాంకాలను పరిశీలిస్తే, భారతీయ తయారీ మద్యం (ఐఎంఎల్) కేసులు 362 లక్షల నుంచి 414 లక్షలకు పెరిగి 14.59 శాతం వృద్ధిని నమోదు చేశాయి. బీర్ విక్రయాలు 136 లక్షల కేసుల నుంచి 232 లక్షల కేసులకు పెరిగి 70.29 శాతం భారీ వృద్ధి సాధించాయి. మొత్తం సేల్స్ విలువ రూ.29,440 కోట్ల నుంచి రూ.31,237 కోట్లకు పెరిగి 6.11 శాతం వృద్ధి నమోదైంది. సేల్స్ ద్వారా వచ్చే రెవెన్యూ రూ.24,734 కోట్ల నుంచి రూ.25,727 కోట్లకు పెరిగి 4.01 శాతం వృద్ధి సాధించింది. అయితే "ఎల్ఎఫ్, ఇతరాలు" విభాగంలో ఆదాయం రూ.4,112 కోట్ల నుంచి రూ.3,316 కోట్లకు తగ్గి 19.37 శాతం పడిపోయింది. దీని ప్రభావంతో మొత్తం రూ.28,846 కోట్ల నుంచి రూ.29,042 కోట్లకు మాత్రమే పెరిగి 0.68 శాతం స్వల్ప వృద్ధి నమోదైంది. అధికారిక గణాంకాల ప్రకారం, తక్కువ ధరల మద్యం అమ్మకాలు పెరగడం వల్ల ఆదాయం అనుకున్నంతగా పెరగలేదు. విక్రయాలలో రూ.99 ధర ఉన్న 180 మిల్లీ లీటర్ బాటిళ్ల వాటా పెరగడం వల్ల సుమారు రూ.442 కోట్ల వరకు నష్టం జరిగింది. అలాగే ప్రముఖ బ్రాండ్ల ధరలు తగ్గించడంతో రూ.972 కోట్ల వరకు ఆదాయం తగ్గింది. గత ఏడాదితో పోలిస్తే 180 మిల్లీ లీటర్ బాటిల్ సగటు ధర రూ.180 నుంచి రూ.160కి తగ్గింది. అలాగే గత ఆర్థిక సంవత్సరంలో వచ్చిన సుమారు రూ.1,900 కోట్ల నాన్-రీఫండబుల్ ఫీజులు ఈసారి లేకపోవడం కూడా మొత్తం ఆదాయంపై ప్రభావం చూపింది. అయినా, మద్యం అమ్మకాలతో వినియోగం పెరుగుతున్నట్లు ఈ గణాంకాలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

## ఏపీ ఎన్నికల్లో భారీ అక్రమాలు ?

- అర్ధరాత్రి 3500 బూత్ లలో ?
- పరకాల మరో సంచలనం..!





**న్యూఢిల్లీ ,ఏప్రిల్ 2 (వార్తాప్రభ) :** ఏపీలో 2024లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భారీ ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఎప్పటి నుంచో ఆరోపిస్తున్న సామాజిక వేత్త, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ భర్త పరకాల ప్రభాకర్ తాజాగా మరో సంచలనం రేపారు. పోలింగ్ చోటు చోటు చేసుకున్న అక్రమాలను గణాంకాలతో సహా బయటపెట్టారు. ముఖ్యంగా ఆ రోజు అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా జరిగిన భారీ పోలింగ్ తో పాటు ఓటు నమోదుకు పట్టిన సమయం వంటి వివరాలను ఆయన ఢిల్లీలో తాజాగా వెల్లడించారు. రాష్ట్రంలో గత ఎన్నికల్లో పోలింగ్ రోజు అర్ధరాత్రి తర్వాత అసాధారణ రీతిలో దాదాపు 17 లక్షల ఓట్లు నమోదయ్యాయని, ముఖ్యంగా ఆరు సెకన్లలోపే ప్రతీ ఓటూ పోలైనట్లు పరకాల ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు 3,500 బూత్‌లలో తెల్లవారుజామున 2 గంటల వరకు పోలింగ్ కొనసాగిందని ఆయన వెల్లడించారు. రాత్రి 11.45 గంటల నుండి తెల్లవారుజామున 2 గంటల మధ్య మొత్తం ఓట్లలో సుమారు 4.16% పోలయ్యాయని, ఈ గణాంకాలు ఆందోళనకరమైన చిత్రాన్ని ఆవిష్కరిస్తున్నాయని ప్రభాకర్ పేర్కొన్నారు. పోలింగ్ చోటు చోటు చేసుకున్న అక్రమాలను గణాంకాలతో సహా బయటపెట్టారు. ముఖ్యంగా ఆ రోజు అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా జరిగిన భారీ పోలింగ్ తో పాటు ఓటు నమోదుకు పట్టిన సమయం వంటి వివరాలను ఆయన ఢిల్లీలో తాజాగా వెల్లడించారు. రాష్ట్రంలో గత ఎన్నికల్లో పోలింగ్ రోజు అర్ధరాత్రి తర్వాత అసాధారణ రీతిలో దాదాపు 17 లక్షల ఓట్లు నమోదయ్యాయని, ముఖ్యంగా ఆరు సెకన్లలోపే ప్రతీ ఓటూ పోలైనట్లు పరకాల ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు 3,500 బూత్‌లలో తెల్లవారుజామున 2 గంటల వరకు పోలింగ్ కొనసాగిందని ఆయన వెల్లడించారు. రాత్రి 11.45 గంటల నుండి తెల్లవారుజామున 2 గంటల మధ్య మొత్తం ఓట్లలో సుమారు 4.16% పోలయ్యాయని, ఈ గణాంకాలు ఆందోళనకరమైన చిత్రాన్ని ఆవిష్కరిస్తున్నాయని ప్రభాకర్ పేర్కొన్నారు. రాత్రి 8 గంటల నుండి తెల్లవారుజామున 2 గంటల మధ్య దాదాపు 52 లక్షల ఓట్లు నమోదయ్యాయని పరకాల తెలిపారు. కేవలం అర్ధరాత్రి తర్వాతే 17 లక్షలకు పైగా ఓట్లు పోలయ్యాయన్నారు. అర్ధరాత్రి తర్వాత ప్రతి 20 సెకన్లకు ఒక ఓటు పోలవడం అత్యంత ఆశ్చర్యకరమైన విషయమన్నారు. ఈవీఎంలు రీసెట్ అవ్వడానికి 14 సెకన్లు పడుతుంటే, అంత తక్కువ సమయంలో ఓట్లు ఎలా పోలయ్యాయని ఆయన ప్రశ్నించారు. ఆ సమయంలో ఒక ఓటరు వాస్తవంగా లోపలికి వెళ్లి, ఓటు వేసి, బయటకు రావడం సాధ్యమేనా?" అని ప్రభాకర్ ప్రశ్నించారు. రాత్రి 8 గంటల తర్వాత "ఏదో అసాధారణమైనది" జరిగిందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి 175 సీట్లకు గానూ 164 సీట్లు సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో కేవలం టీడీపీ 135 సీట్లు గెల్చుకుంది. జనసేనకు 21, బీజేపీకి 8 సీట్లు దక్కాయి. ఈ ఎన్నికలపై విపక్ష వైసీపీ ఎప్పటి నుంచో అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. ఓటింగ్ శాతం గణాంకాలపై కోర్టుకు కూడా వెళ్లింది. 2024 మే 13న సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసిన తర్వాత ఎన్నికల ప్రధానాధికారి 68.04% ఓట్లు పోలయ్యాయని ప్రకటించారు, రాత్రి 8 గంటలకు ఈసీ విడుదల చేసిన ఒక ప్రకటనలో ఓటింగ్ శాతం 68.12%గా ఉందని తెలిపింది. రాత్రి 11.45 గంటలకు ఈసీ ఓటింగ్ శాతాన్ని 76.50%కి సవరించింది. నాలుగు రోజుల తర్వాత విడుదల చేసిన తుది ఓటింగ్ శాతం 81.79%గా ఉంది.

# వంటావార్పుతో నిరసన సెగ చూపెట్టిన ఆర్టిజన్స్!!

● సర్కార్‌కు ఆర్టిజన్ కార్మికుల అల్టిమేటం ● ఏప్రిల్ 8 నుంచి విద్యుత్ సమ్మె సైరన్ ● చర్చలు జరపండి.. లేదంటే వ్యవస్థను స్తంభింపజేస్తాం ● సంఘం నాయకులు వడ్డేపల్లి సురేష్



**పెద్దపల్లి/ గోదావరిఖని: ఏప్రిల్ 2 (వార్తాప్రభ ప్రతినిధి)**రామగుండం గడ్డపై ఆర్టిజన్ కార్మికుల ఆవేదన జ్వాలలు మిన్నంటాయి. తమ న్యాయమైన హక్కుల సాధన కోసం జేఏసీ పిలుపు మేరకు చేపట్టిన 'వంటా–వార్పు' నిరసన కార్యక్రమం సర్కిల్ కార్యాలయం సాక్షిగా ప్రభుత్వ మొండివైఖరిని ఎండగట్టింది. గత నెల 26, 30 తేదీల్లో ప్రారంభమైన ఈ ఉద్యమ సెగలు, నేడు కార్యాలయం ముంగిట పొయ్యిలు వెలిగించి వంటలు వండటంతో మరోసారి ఉవ్వెత్తున ఎగిశాయి. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు వడ్డేపల్లి సురేష్ మాట్లాడుతూ.....ప్రభుత్వం తమ డిమాండ్ల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని, ఏప్రిల్ 8వ తేదీ నుండి నిరవధిక సమ్మె బాట పట్టి రాష్ట్ర విద్యుత్ వ్యవస్థను స్తంభింపజేస్తామని ఈ సందర్భంగా గర్జించారు. చర్చల పేరిట కాలయాపన చేయకుండా, తక్షణమే తమ సమస్యలను పరిష్కరించి కార్మికుల పొట్ట నింపాలని వారు డిమాండ్ చేశారు. నిప్పు కణికల్లాంటి ఆగ్రహంతో సాగిన ఈ కార్యక్రమంలో కొంకటి శ్రీనివాస్, ఆవుల మహేష్, దుర్గం విశ్వనాథ్, మల్లారపు ప్రభాకర్, ఎస్.రవి, జి.కిరణ్, బోరే శ్రీనివాస్, సదానందం, రమేష్, జనార్ధన్, కృష్ణ, కే. ప్రసాద్, రవి, సుధాకర్, సందీప్, ప్రణయ్ సహా అనేకమంది కార్మికులు పాల్గొని తమ ఐక్యతను చాటారు. తమ శ్రమకు తగ్గ ఫలితం దక్కేవరకు ఈ పోరు ఆగదని, చలో అసెంబ్లీ, సమ్మె ఏదైనా సరే తగ్గేదే లేదన్నట్లుగా కార్మికుల నినాదాలు రామగుండం వీధుల్లో మారుమోగాయి. ఈ నిరసన కేవలం వంటావార్పు మాత్రమే కాదు, ప్రభుత్వం కళ్ళు తెరవకపోతే రాబోయే మహా సంగ్రామానికి ఇది నాంది అని వారు హెచ్చరించారు.

# ప్రాపర్టీ టాక్స్ పై ప్రజలకు అవగాహన కల్పించండి.

ఏప్రిల్ మాసంలో అనుకున్న లక్ష్యాలను సాధించండి.

కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎన్. వసంత.



**జవహర్ నగర్/ దమ్మాయిగూడ, ఏప్రిల్ 2: (వార్తా ప్రభ)**కీసర సర్కిల్ పరిధిలోని ప్రజలకు ప్రాపర్టీ ట్యాక్స్ పై అవగాహన కల్పించాలని తద్వారా ఏప్రిల్ మాసంలో అనుకున్న లక్ష్యాలను సాధించి ఇంటి పన్నులు పూర్తిగా వసూలు చేయాలని కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎన్. వసంత పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కీసర సర్కిల్ పరిధిలోని దమ్మాయిగూడ వార్డ్ ఆఫీసులో గురువారం రెవెన్యూ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ మాసంలో గాను ఐదు శాతం రెబేటుతో ఇంటి పన్నులు వసూలు చేయటగాను రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధియే ధ్యేయంగా పనిచేయాలని సిబ్బంది అనుకున్న లక్ష్యాలను సాధిస్తూ ఇంటి పన్ను వసూళ్ల విషయంలో 100% ప్రగతిని సాధించాలని సూచించారు. ఇందుకోసం ఇంటి పన్ను వసూలులో ప్రత్యేక కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించి ఐదు శాతం రిబేటుతో ఇంటి పన్నులు వసూలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీలు వెంకటేష్, శ్రవణ్, మధుసూదన్ రెడ్డి, నగేష్, రెవెన్యూ టాక్స్ ఇన్స్పెక్టర్లు, జూనియర్ అసిస్టెంట్లు, వార్డ్ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

# బొజ్జ భారం వద్దు - పరుగు పంతం ముద్దు!!




కూర్చుని తింటే కుంభకర్ణుడు కూడా ఓడిపోతాడు
నీ బొజ్జ చూసి ఆ వినాయకుడు కూడా షాక్ అవుతాడు
తిన్నది అరగక, ఒళ్ళు కదలక టైర్లు పెంచుతున్నావు
నడవక శవంలా మారి నీ ఆయుష్షును తుంచుతున్నావు!!
సోఫాలో పడి ఉంటే సోంబేరితనం నీ సొంతం
బయటకు వచ్చి పరుగెడితే ఆరోగ్యం నీ పంతం
మెట్లెక్కలేక ఆయాసపడుతూ ముసలోడిలా మారుతున్నావు
వయసున్నా కూడా వంగిపోతూ భారంగా బతుకుతున్నావు!!
నీ పొట్టే నీకు పెద్ద శత్రువు కాకముందే కదులు
శరీరాన్ని కరిగించు... అవే నీ విజయానికి పునాదులు
పరుగెత్తుతుంటే రక్తం పరుగులు తీయాలి
నీ లోని బద్ధకం అంతా చెమట రూపంలో చావాలి!!
జిమ్ములు వద్దు, ఫీజులు వద్దు... రోడ్లే నీ మైదానం
కష్టపడితేనే కదా దక్కుతుంది ఈ కాయం అనే వరం
బొజ్జ ఉంటే జోకులు... దృఢత్వం ఉంటే కిక్కులు
వద్దనుకో ఆ అవస్థలు... పెంచుకో నీలో కొత్త శక్తులు!!
పరుగు తీసే పులిలా నీ రూపు మారాలి
నీ శారీరక దృఢత్వం చూసి లోకం జై కొట్టాలి
బద్ధకాన్ని కాల్చేయ్... నీ కొవ్వును కరిగించేయ్
సింహంలా గర్జిస్తూ... ఆరోగ్యానికి బాటలు వేయ్!!

**గడ్డం సంతోష్ రాజ్**
గోదావరిఖని

# "అనురాగ్" లో ఘనంగా ఆటిజం దినోత్సవము







**కాప్రా, ఏప్రిల్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నేడు యెల్లారెడ్డి గూడలో కల అనురాగ్ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో ఆటిజం డే ను జరుపుకొన్నారు. ఈ సందర్భముగా అవగాహనా కార్యక్రమములో భాగంగా నేరెడిమేట్ పోలీస్ స్టేషన్ మరియు కాప్రా పరిసర ప్రాంతములలో ప్లై కార్డు లను ప్రదర్శిస్తూ ర్యాలీ ని నిర్వహించి, కర పత్రాలను పంచిపెట్టారు. ఈ సందర్భముగా అనురాగ్ ప్రత్యేక పాఠశాలలో కేక్ ను కట్ చేసారు. ఈ కార్య క్రమములో డాక్టర్ లాల్ కృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతము ఆటిజం సమస్య పిల్లలో వేదిస్తున్న తీవ్ర సమస్య అని, దీనిని ఆటిజం స్పెక్ట్రమ్ డిసార్డరు అని కూడా పిలుస్తారని అన్నారు.ఈ చిన్నారులలో మాట రావడము ఆలస్యం కావడం లేక వచ్చినా కూడా మరల పోవచ్చునని , మరియు సాంగికరణ సమస్యలు గమనించ గలమని ఇటువంటి సమస్యలను గమనించినపుడు సరి అయిన నిపుణలను సంప్రదించవలనని తెలిపారు. ఆటిజం కల ప్రత్యేక పిల్లలకు వివిధ అనుకూల ఆటల పోటీలను నిర్వహించి వారికీ ప్రోత్సాహక బహుమతులను బిందు, డైరెక్టర్ మరియు డా. లాల్ కృష్ణ మణికంఠ అందచేశారు. సాంస్కృతిక కార్యక్రమములో భాగంగా నిర్వహించిన ఫాన్సీ డ్రెస్ అందరిని ఆకట్టుకొన్నాయి. విచ్చేసిన తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు కేర్ టేకర్ లు ప్రత్యేక విందు భోజనంలో పాల్గొన్నారు.

# జీజీహెచ్‌లో కంటి వెలుగుల నవశకం!!

● ఉచిత శస్త్రచికిత్సలు ప్రారంభం ● పేదల ముంగిటకే కార్పొరేట్ వైద్యం ● విజయవంతంగా తొలి కాటరాక్ట్ సర్జరీ ● అత్యాధునిక పరికరాలతో ఉచిత వైద్యం ● అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రజలకు కలెక్టర్ పిలుపు





**పెద్దపల్లి/ గోదావరిఖని: ఏప్రిల్ 2 (వార్తాప్రభ ప్రతినిధి)**పెద్దపల్లి జిల్లా వైద్యారోగ్య రంగంలో ఒక కీలక మైలురాయి నమోదైందని, గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అత్యాధునిక కంటి శస్త్రచికిత్సలు అధికారికంగా ప్రారంభమయ్యాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం అత్యంత ఉత్సాహంతో ప్రకటించారు. పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను చేరువ చేయాలనే ప్రభుత్వ సంకల్పంలో భాగంగా ఆప్తామాలజిస్ట్ విభాగంలో ఆపరేషన్లను బుధవారం నుండే అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రముఖ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ గోపికృష్ణ నేతృత్వంలోని వైద్య బృందం నిన్న విజయవంతంగా మొదటి కాటరాక్ట్ (కంటి శుక్లం) సర్జరీని నిర్వహించి, ఆసుపత్రి చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గతంలో ఇలాంటి ఆపరేషన్ల కోసం ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇకపై ఆ అవసరం లేకుండా రామగుండం పరిసర ప్రాంత వాసులకు ఇక్కడే నాణ్యమైన చికిత్స అందుతుందని స్పష్టం చేశారు. ఆసుపత్రిలో శస్త్రచికిత్సలకు అవసరమైన అన్ని రకాల అత్యాధునిక వైద్య పరికరాలు, మౌలిక వసతులు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ఉన్న కంటి సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం పెంచేలా వైద్యులు నిరంతరం శ్రమించాలని, కంటి వెలుగు పథకం స్ఫూర్తితో ప్రతి ఒక్కరికీ చూపు అందించడమే లక్ష్యమని ఆయన తెలిపారు. నిరుపేదల ముంగిటకే స్పెషాలిటీ వైద్య సేవలను తీసుకువచ్చిన ఈ మార్పు పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కంటి శుక్లాల సమస్యతో బాధపడేవారు ఆలస్యం చేయకుండా గోదావరిఖని జనరల్ ఆసుపత్రిని సంప్రదించి తమ దృష్టిని భద్రం చేసుకోవాలని కలెక్టర్ తన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి





**మల్కాజ్ గిరి :ఏప్రిల్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మల్కాజ్ గిరి నియోజవర్గంలోని యాదవ్ నగర్‌లో గల సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మల్కాజ్ గిరి గౌడ సంక్షేమ సంఘ సభ్యులతో కలిసి విగ్రహానికి పూలమాల వేసి, పాపన్న గౌడ్ సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సామాజిక న్యాయం, సమానత్వం కోసం పోరాడిన గొప్ప యోధుడని కొనియాడారు. సమాజంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం ఆయన చేసిన త్యాగాలు తరతరాలకు ఆదర్శమని తెలిపారు. ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో గౌడ సంక్షేమ సంఘ సభ్యులు మల్లేష్ గౌడ్, వెంకట్ నరసయ్య గౌడ్, బత్తిని నరసింహ గౌడ్, జీడి నవీన్ గౌడ్, మిట్టపల్లి విజయ్ గౌడ్, రమేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, జగదీష్ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, శ్రీధర్ గౌడ్,ప్రభాకర్ గౌడ్, యాదయ్య గౌడ్, వేణుగోపాల్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు జగదీష్ గౌడ్, మురుగేష్, బిఆర్ఎస్ నాయకులు జేసి వెంకన్న, రాము యాదవ్, వెంకటేష్, చిన్న యాదవ్, చంద్రశేఖర్, నాగరాజు, ఏడుకొండలు పాల్గొన్నారు.

# స్వయం ఉపాదే... స్వావలంబనకు ముందడుగు

● స్వశక్తితోనే.... ఏదైనా సాధించగలము.

● కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్.





**జవహర్ నగర్, ఏప్రిల్ 2: (వార్తా ప్రభ)** స్వయం ఉపాదే...స్వావలంబనకు ముందడుగని స్వశక్తితోనే ఏదైనా సాధించగలమని జవహర్ నగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లోని గబ్బిలాల పేటలో స్వయం ఉపాధి నినాదంతో వెంకటేష్ వాటర్ ఫిల్టర్ ప్లాంటును గురువారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ యువత ప్రస్తుత తరుణంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం వేచి చూడకుండా స్వశక్తితో వివిధ మార్గాల ద్వారా స్వయం ఉపాధి మార్గాలను వెతుక్కుని స్వశక్తితో ముందడుగు వేయడం అభినందనీయమన్నారు. నేటి సమాజంలో ప్రతి ఒక్కరు స్వయంకృషితో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గబ్బిలాల పేటలో గరీబోల్లే ఎక్కువగా నివసిస్తున్నారని వారికి కనీస అవసరాలు తీర్చే బాధ్యత ప్రభుత్వంపై ఉందని దీనికోసం తెలంగాణ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని 6 గ్యారంటీ పథకాల తో బాటు పేద ప్రజలకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికి దక్కుతుందని తెలిపారు. వేసవికాలం దృష్ట్యా ప్రజల ప్రాథమిక అవసరమైన నీటిని తక్కువ ధరకు పంపిణీ చేయాలనే ఉద్దేశంతో శాఫు వెంకటేష్ ప్రారంభించిన" నీటి శుద్ధికరణ బండాగారాన్ని"ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం నీటి శుద్ధీకరణ భాండాగార యజమాని శాఫు వెంకటేష్ మాట్లాడుతూ పేద ప్రజలకు నిలయమైన గబ్బిలాల పేటలో తక్కువ ధరకే త్రాగే మంచి నీటిని సరఫరా చేస్తామని, అలాగే దివ్యాంగులకు, గర్భిణీ స్త్రీలకు, తక్కువ ధరలో నీటిని పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు మండల సురేందర్, ఆకుల నరసింహ, పందిరి శ్రీనివాసులు, తూటి శ్రీనివాసులు, స్వామి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాట్ల వినయ్, మాట్ల శ్రీనివాస్, కె. శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్

# వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండాలి

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి





**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఏప్రిల్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి):** ఎంతో నమ్మకంగా వచ్చే పేషంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. సోమవారం కూకట్పల్లి లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఎం అండ్ హెచ్ఓ ఉమాగౌరి తో కలిసి జిల్లా కలెక్టర్ మను చౌదరి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు అంకితభావంతో పేషంట్లుకు సేవలు అందించాలని, అన్ని వేళలలో వైద్యులు అందుబాటులో ఉండాలని అన్నారు. రోజుకు ఎంత మంది పేషంట్లు వస్తారని, వారి వివరాలను సంబంధిత రిజిష్టర్లలో నమోదు చేస్తున్నారా అని అడిగి రిజిష్టర్లను పరిశీలించారు. ఆసుపత్రిలో ఏవైనా సమస్యలు ఉన్నాయా అని మెడికల్ ఆఫీసర్ ను అడిగి తెలుసుకున్నారు.ఆసుపత్రికి కావలసిన మరమ్మత్తులు, ఇన్ ఫ్రాస్ట్రక్చర్, డెలివరీ టీమ్స్ వంటి సమస్యలను మెడికల్ ఆఫీసర్ కలెక్టర్ కు తెలుపగా, కలెక్టర్ స్పందిస్తూ అవసరమైన వాటికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. శానిటేషన్ వారితో సమన్వయం చేసుకుంటూ ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. మందుల గదిని పరిశీలించి ఎక్స్పైరీ డేట్ పరిశీలించి మందులు అందించాలని సిబ్బందికి సూచించారు.

# తుర్కపల్లి జహంగీర్ మృతి సాంస్కృతికోద్యమానికి తీరనిలోటు

-సంయుక్త పత్రిక ప్రకటనలో పేర్కొన్న ఐ.ఎఫ్.టి.యు. షేక్ షావలి, పిఓడబ్ల్యూ(విముక్తి) పెర్క సునిత.





**జవహర్ నగర్, ఏప్రిల్ 02:(వార్తా ప్రభ)**తెలంగాణ కళాసమితి కన్వీనర్ కామ్రేడ్ మహ్మద్ తుర్కపల్లి జహంగీర్ మరణం ప్రజా సాంస్కృతికోద్యమానికి తీరనిలోటు అని ఇఫ్టూ జాతీయ కన్వీనర్స్ షేక్ షావలి, పిఓడబ్ల్యూ (విముక్తి) సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటి పెర్క సునీత స్పష్టం చేశారు. 2026, ఏప్రిల్–2, గురువారం రోజు, భువనగిరి జిల్లా, తుర్కపల్లి గ్రామంలో హఠాత్మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. ఆయన మరణానికి తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర విభజన ఉద్యమంలో ముందుడి ఉద్యమించారని పేర్కొన్నారు. తెలంగాణ జనసభ నాయకుడిగా అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారని గుర్తుచేశారు. బౌగోళిక తెలంగాణ ద్వారా తెలంగాణ ప్రజల, ఉద్యమకారుల సమస్యలు పరిష్కారం కావని, ప్రజాస్వామిక తెలంగాణ సాధన ద్వారానే అది సాధ్యం అని బావించి, పోరాడిన వ్యక్తి జహంగీర్ అని కొనియాడారు. గత కొంత కాలంగా అనారోగ్య శారీరక సమస్యలు జహంగీర్ ను వేదించాయని, కానీ ప్రజా ఉద్యమాలపట్ల, ప్రజా సాహిత్యం, కళలపట్ల అమితమైన ప్రేమ అబిమానం, అంకితభావం ఆయన సొంతం అని ఈసందర్భంగా గుర్తు చేశారు.

# సమాజ సేవ ప్రతి ఒక్కరి బాధ్యత.

ఎన్.ఏం.జి.సేవా ట్రస్ట్ చైర్మన్ నిమ్మల ధాత్రీనాథ్ గౌడ్



**శేరిలింగంపల్లి,ఏప్రిల్, 2 (వార్తాప్రభ)::** మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు హఫీజ్‌పేట్‌లో చలివేంద్రం ఘనంగా ప్రారంభించారు.గురువారం జనప్రియ అపార్టుమెంట్స్, ఫేజ్--1, సాయిబాబా కమాన్ వద్ద ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని హఫీజ్‌పేట్ డివిజన్ కు చెందిన యువనాయకులు,ఎన్.ఎం.జి. సేవా ట్రస్ట్ చైర్మన్ నిమ్మల ధాత్రీనాథ్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు.ఈ సందర్భంగా నిమ్మల ధాత్రీనాథ్ గౌడ్ మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి సమయంలో చలివేంద్రాల ద్వారా తాగునీరు, మజ్జిగ అందించడం ఎంతో అవసరమని అన్నారు. సమాజ సేవ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జనప్రియ శ్రీనివాస్,హరికృష్ణ,సుధాకర్ దాస్, సుధీర్, తరుణ్,శ్రీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

## అమరావతికి చట్టబద్ధతతో కేంద్రం బాధ్యత సరేనా?

ఉమ్మడి ఏపీని అడ్డగోలుగా నాటి యూపీఏ ప్రభుత్వం విభజించింది. ఆ సమయంలో ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ కూడా పూర్తి మద్దతు ప్రకటించింది. దాంతోనే ఈ విభజన సాధ్యమైంది. ఇక 2014 ఎన్నికల ముందు ఏపీలో నాటి ఎన్డీయే కూటమి ప్రధాని అభ్యర్ధిగా పర్యటించిన నరేంద్ర మోడీ అనేక చోట్ల మాట్లాడుతూ ఢిల్లీని తలదన్నే రాజధానిని ఏపీకి నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే పుష్కర కాలం గడచింది కానీ ఏపీ రాజధాని ఇంకా ఒక రూపునకూ షేపునకూ రాలేదు, కేంద్రం అయితే ఏపీ రాజధాని విషయంలో తమకేమీ సంబంధం లేనట్లుగానే వ్యవహరించింది అన్న విమర్శలు ఉన్నాయి.. అమరావతిపై వైపీ కీలక వ్యాఖ్యలు చట్టబద్ధత లేటుగా: ఏపీకి రాజధాని అమరావతి అన్న దాని మీద చట్టబద్ధత కల్పించే విషయం కూడా లేటుగా జరిగింది. ఇక అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం తనకు తానుగా చేస్తున్న ఆర్థిక సాయం ఎంత అన్నది చూస్తే నిరాశే కలుగుతుంది. మొత్తం మీద గడచిన పుష్కర కాలంలో రెండు వేల అయిదు వందల కోట్ల రూపాయల దాకా ఇచ్చినట్లుగా గణాంకాలు చెబుతున్నాయి. ఇంత తక్కువ మొత్తంతో రాజధాని అన్నది పూర్తి అయితే కాదు, అయితే ఏపీలో టీడీపీ ప్రభుత్వం అతి పెద్ద రాజధానికి పూనుకుంది. దాంతో దానికి అయ్యే భారీ ఖర్చుని కేంద్రం భరించకపోవచ్చు కానీ కేంద్రం ఇవ్వాలనుకున్న మొత్తం కనీసంగా ఏ పాతిక వేల కోట్ల రూపాయలుగానో అయిన ఉంటేనే అమరావతి రాజధాని వేగంగా నిర్మాణం జరుపుకుంటుంది. ఇది గ్రాంట్ ఇని ఎయిడ్ కింద కేంద్రం ఇవ్వాల్సి ఉంటుంది. అదే సమయంలో వివిధ ఏజెన్సీల ద్వారా రుణాలను ఇప్పించే విషయంలో కేంద్రం పూచీకత్తు పడడం మంచిదే కానీ కేంద్రం కూడా ఏపీని ఆదుకోవాల్సి ఉంది అని అంటున్నారు. ప్రతీ ఏటా యాభై లక్షల కోట్ల రూపాయలకు తక్కువ లేకుండా కేంద్ర బడ్జెట్ ని ప్రవేశ పెడుతున్నారు అందులో ఏపీ వంటి విభజన గాయాలతో బాధపడుతున్న రాష్ట్రానికి ఏపీ పునర్ నిర్మాణం కోసం కేంద్రం ఉదారంగా నిధులు ఇవ్వాల్సిన అవసరం లేదా అన్న చర్చ సాగుతోంది. ప్రస్తుతం చూస్తే పూర్తిగా ఏపీకి చెందిన ఎంపీల మద్దతుతోనే కేంద్ర ప్రభుత్వం నడుస్తోంది. అయినా సరే అమరావతికి గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద నిధులు విదల్చలేదన్నది అంతా గమనిస్తున్నారు. ఇక ప్రత్యేక హోదా విషయం కూడా తాజాగా లోక్ సభలో జరిగిన చర్చలో పలువురు ఎంపీలు కేంద్రానికి గుర్తు చేశారు. ఏపీకి ప్రత్యేక హోదాని కనీసం పదేళ్ళు అయినా ప్రకటించాల్సి ఉంది. అలాగే విభజన హామీలను కేంద్రం పట్టించుకుని నెరవేర్చాలి. అంతే కాకుండా భారీ రెవిన్యూ లోటుతో విడిపోయిన రాష్ట్రానికి అన్ని విధాలుగా అండగా ఉంటూ కేంద్రం ఏపీని మిగిలిన రాష్ట్రాలతో పోటీ పడే స్థాయిలో ఉంచాల్సి ఉంది అని అంటున్నారు. ఏపీలో రాజకీయమే కేంద్రంలో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికి అడ్వాంటేజ్ గా ఉంది అని అంటున్నారు అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య ఏ ఒక్క అంశంలోనూ ఐక్యత లేదు, కలసికట్టుగా కేంద్రం మీద ఒత్తిడిని తెచ్చే కార్యక్రమం లేదు, దాంతోనే కేంద్ర ప్రభుత్వం నిర్భావీగా ఉంటోంది అని అంటున్నారు. లోక్ సభలో అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పించే అంశం మీద జరిగిన చర్చలో అనేక మంది ఏపీ కోసం చాలా విషయాలు చెప్పారు, సూచనలు చేశారు. కానీ అధికార బీజేపీ నుంచి ఏ ఒక్క హామీ అయితే రాలేదు అన్నది గుర్తుంచుకోవాలి. ఇపుడు అమరావతికి చట్టబద్ధత ఇచ్చామని అదే గొప్ప అన్నట్లుగా కేంద్రం చెప్పుకుంటే ఏపీ ప్రజలకు ఒరిగేది ఏముంది అన్న ప్రశ్నలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఏపీ రాజధాని విషయంతో పాటు పోలవరం, ప్రత్యేక హోదా ఇతర విభజన హామీల విషయంలో కేంద్ర ప్రభుత్వం హామీలు నెరవేర్చే దిశగా అడుగులు వేయాలని అంతా కోరుతున్నారు. చూడాలి మరి కేంద్రం స్పందన ఎలా ఉంటుందో.


## ఈస్టర్ పండగ ఏర్పాట్లను సమీక్ష జరిపి, సరి చేయకపోతే ధర్నా నిర్వహిస్తాం.

**- అధికారులకు క్రిస్టియన్ యూత్ ప్రెసిడెంట్ సురేష్ కుమార్ హెచ్చరిక**



**శేరిలింగంపల్లి,ఏప్రిల్ 2 (వార్తాప్రభ):** ఈస్టర్ పండుగ ఏర్పాట్లకు సంబంధించి ఇచ్చిన వినతిపై అధికారులు స్పందించలేదని హాఫిజ్‌పేట్ క్రిస్టియన్ యూత్ ప్రెసిడెంట్ సుదేష్ కుమార్ ఆరోపించారు. గత నెల 23-03-2026న ప్రజావాణి కార్యక్రమంలో మియాపూర్ డీసీకి సమస్యలపై వినతిపత్రం సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. సంబంధిత సిఎంసీ అధికారులు కనీసం సమస్యలను పరిశీలించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఈస్టర్ పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో తక్షణమే సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం,సంబంధిత అధికారులను ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో హాఫిజ్‌పేట్ కాలనీ ప్రజలతో కలిసి మియాపూర్ డీసీ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

## దైవమే సర్వము



లేకుంటే దైవమే
సృష్టి ఎలా నడుస్తుంది
చీకటి అగును లోకమే
అవుతుంది నాశనమే
సర్వానికి ఆధారము
సకల లోక రక్షకుడు
విశ్వ మానవ ప్రేమికుడు
దరి చేరితే స్నేహితుడు
కొలవాలి హృదయంతో
నిర్మలమైన భక్తితో
అవుతాడు సన్నిహితుడు
బ్రతుకులోన భగవంతుడు
నమ్మదగిన దేవుడు
చూడగా తేజోమయుడు
హృదయాలే మందిరము
చేయును అందు నివాసము

**-గద్వాల సోమన్న,**
గణితోపాధ్యాయుడు,
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

# దేశ ప్రధాని నరేంద్ర మోదీ కి ధన్యవాదాలు తెలిపిన ఏపీ కూటమి ఎంపీలు

● యువ నాయకుడు, మంత్రి నారా లోకేష్ నేతృతంలో ప్రధానిని కలిసిన ఎమ్ పి లు ● అమరావతి చట్టబద్ధత బిల్లు ● ఆమోదానికి కృషిచేసిన ప్రధాని మోదీ కు కృతజ్ఞతలు తెలిపిన ఎంపీలు ● రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లుకు రాష్ట్రపతి ఆమోదముద్ర త్వరిత గతిన లభించేలా చూడాలని ప్రధానిని కోరిన వైనం ● సానుకూలంగా స్పందించిన దేశ ప్రధాని నరేంద్ర మోదీ





**విజయవాడ పశ్చిమ ఎప్రిల్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ నిన్న లోక్ సభ లో, నేడు రాజ్యసభలోనూ ప్రవేశపెట్టిన తీర్మానం ఆమోదం పొందినందుకు కృషి చేసినందుకు దేశ ప్రధాని నరేంద్ర మోదీ కి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కూటమి పార్టీల ఎంపీలు ధన్యవాదాలు తెలిపారు. యువనేత, రాష్ట్ర విద్య – ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో గురువారం పార్లమెంటులో ప్రధానమంత్రి మోదీ ని ఆయన కార్యాలయంలో రాజ్యసభ, లోకసభలో కూటమి పార్టీ ఎంపీల బృందం కలిసింది. ప్రధానమంత్రిని నారా లోకేష్ నేతృత్వంలో అమరావతి ప్రాంత విజయవాడ ఎంపీ కేశినేని శివనాద్ (చిన్ని) తో పాటుగా కలిసిన ఎంపీలు ప్రత్యక్షంగా ధన్యవాదాలు తెలిపారు. ఐదుకోట్ల ప్రజల ఆకాంక్ష అయిన అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు పూర్తి మెజారిటీతో పార్లమెంటు ఆమోదం లభించడానికి కృషి చేసిన ప్రధాని నరేంద్ర మోదీ కి మంత్రి నారా లోకేష్ , సహచర ఎంపీలతో కలిసి కృతజ్ఞతలు తెలియజేసినట్లు విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాద్ (చిన్ని) తెలిపారు. పార్లమెంటులో అమరావతి చట్టబద్ధత బిల్లుకు సంపూర్ణ మద్దతు తెలిపిన విధంగానే బిల్లుకు రాష్ట్రపతి ఆమోదముద్ర త్వరితగతిన వచ్చేలా చూడాలని ప్రధానమంత్రిని ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్, ఎంపీల బృందం కోరినట్లు శివనాథ్ తెలిపారు. అదేవిధంగా అమరావతి ప్రాంత అభివృద్ధికి నిధుల కేటాయింపు, రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులపై సైతం ప్రధానితో మంత్రి నారా లోకేష్ తో కలిసి చర్చించినట్లు వివరించారు. దేశ ప్రధాని నరేంద్ర మోది సైతం మంత్రి నారా లోకేష్, ఎంపీల బృందం విజ్ఞాపనకు సానుకూలంగా స్పందించారు. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రాంత అభివృద్ధికి సైతం తన సంపూర్ణ సహకారం అందిస్తానని ప్రధాని మోదీ హామీ ఇచ్చినట్లు ఎంపీ కేశినేని శివనాథ్ వివరించారు.

# ఎస్.కె.పి.వి.వి గ్రూపు నూతన స్కూల్ ప్రారంభం

● 6.5 ఎకరాల ప్రాంగణంలో ఆధునిక చౌకర్యాలతో.........● సి.బి.ఎస్. సిలబస్ తో విద్యా బోధనావిధానం ● విద్యార్థి సమగ్ర వికాసానికి పెద్దపీట






**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 2:(వార్తా ప్రభ ప్రతినిధి)** 120 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర ఉన్న తమ ఎస్.కె.పి.వి.వి హిందూ హై స్కూల్ కమిటీ ఆధ్వర్యంలో నూతన విద్యాసంస్థ ఎస్.కె.పి.వి.వి దోకుపర్తి ఉపేంద్ర హై స్కూల్' ను విద్యాసంవత్సరం (2026-27) నుంచి ప్రారంభిస్తున్నట్లు 'కమిటీ' ప్రెసిడెంట్ టి .శేషయ్య చెప్పారు. గురువారం పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో టి.శేషయ్య మాట్లాడుతూ విజయవాడ రూరల్ ప్రాంతంలో జక్కంపూడి కాలనీ మార్గం లో మరెక్కడా లేనివిధంగా 6.5 ఎకరాల విశాలమైన ప్రాంగణంలో పాఠశాల ఏర్పాటుచేసినట్లు చెప్పారు. సి.బి.ఎస్.ఇ కరికులమ్ తో ఆధునిక సమాజ అవసరాలకు తగినట్లు విద్యార్థులను సమగ్ర వ్యక్తిత్వం కలిగినవారుగా తీర్చిదిద్దే లక్ష్యంతో తమ పాఠశాల పనిచేస్తుందని చెప్పారు. ఐదు ఎకరాల స్థలాన్ని క్రీడల కోసం కేటాయించామన్నారు. నర్సరీ నుంచి 7వ తరగతి వరకు క్లాసులు ప్రారంభమైనట్లు చెప్పారు. 'స్కూల్' కమిటీ ప్రెసిడెంట్ దోకుపర్తి సుజాత మాట్లాడుతూ విద్యార్థుల్లో పాఠశాల స్థాయి నుంచే వివిధ నైపుణ్యాల్లో తీర్చిదిద్దేందుకు 'స్కిల్ ల్యాబ్స్' ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఇన్ ఛార్జి సెక్రటరీ డాక్టర్ టి.శ్రీనివాసు మాట్లాడుతూ ప్రతి తరగతిలో ఇంటరాక్టివ్ బోర్డ్స్ ఏర్పాటుచేసామని, ఎకో ఫ్రెండ్లీ క్యాంపస్ గా పాఠశాలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రిన్సిపాల్ పి.శ్యామల మాట్లాడుతూ ఆర్ట్స్, స్పోర్ట్స్ రంగాల్లో ప్రత్యేక ట్రైనర్స్ ని ఏర్పాటుచేసి, విద్యార్థులకు అన్నిరంగాల్లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. 21వ శతాబ్దపు పౌరుడిగా విద్యార్థులు ఎదిగేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సమావేశంలో హైస్కూల్స్ కమిటీ ట్రెజరర్ గోళ్ళ బాబా విజయ్ కుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి. నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంటులో అమరావతి బిల్లు ఆమోదం చారిత్రాత్మకం

**సీనియర్ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్**



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 2: (వార్తా ప్రభ ప్రతినిధి)** పార్లమెంటు ఉభయ సభల్లోనూ ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి బిల్లు ఆమోదం పొందడం చారిత్రాత్మకమని సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతిని ఆంధ్రప్రదేశ్ శాసనసభలో తీర్మానం చేసి కూటమి ప్రభుత్వం కేంద్రానికి పంపించడం, అటుపై బుధవారం లోక్ సభ లోను, గురువారం రాజ్యసభలోను అమరావతి బిల్లు చట్టబద్ధం అవుతూ ఉభయ సభలు ఆమోదించడం ఎంతో సంతోషకరమని ఆకుల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి ఉండాలని రాష్ట్ర ప్రజలందరి అభిలాష అని ఆయన అన్నారు. ఇక రాజధాని అభివృద్ధి పనులను పరుగులు పెట్టించవలసిన ఆవశ్యకత రాష్ట్ర ప్రభుత్వంపై మరింతగా పెరిగిందని ఆకుల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇప్పటికే రాజధానికి భూములు ఇచ్చిన రైతుల కళ్ళలో ఎంతో ఆనందం కనబడుతుందని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి ఉండాలని కోరుకున్న కోరిక నేడు పార్లమెంటు ఉభయసభల ఆమోదం ద్వారా నెరవేరిందని ఆయన అన్నారు. రాష్ట్రపతి ఆమోదం తర్వాత ఈ బిల్లు చట్ట రూపం దాల్చుతుందని, తద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రజల కలలు సాకారం అవుతాయని ఆయన వివరించారు .బిల్లు ఆమోదం పొందడం పట్ల రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని అన్నారు. రాజధాని అమరావతి తో పాటు చుట్టుపక్కల ఉన్న విజయవాడ, గుంటూరు, మంగళగిరి, తెనాలి తదితర నగరాలు, పట్టణాలు సమీప ప్రాంతాలు కూడా కూడా శరవేగంగా రాజధానితో పాటు అభివృద్ధి చెందేందుకు పుష్కలమైన అవకాశాలు ఏర్పడ్డాయని ఆకుల శ్రీనివాస్ పేర్కొన్నారు.

## బేబీ తమోఘ్న కి సి పి అభినందనలు, దీవెనలు



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉగాది పురస్కారాన్ని అందుకున్న ఎన్.టి.ఆర్.జిల్లా హెడ్ కానిస్టేబుల్ తులసి చైతన్య (పోలీస్ స్విమ్మర్) కుమార్తె బేబీ తమోఘ్నను నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు అభినందించారు, అలాగే దీవెనలు అందించారు. గురువారం నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు వారి కార్యాలయంలో హెడ్ కానిస్టేబుల్ 2410 తులసి చైతన్య, చైతన్య కుమార్తె బేబీ తమోఘ్న లను కలిసి వివరాలను అడిగి తెలుసుకుని చిన్న వయస్సులో పతకాలను గెలిచినందుకు అభినందించారు. ఇదేవిధంగా అన్ని పోటీలలో పాల్గొని పతకాలను మరిన్ని రికార్డులను కైవసం చేసుకుని ఆంధ్రప్రదేశ్ మరియు ఎన్.టి.ఆర్.జిల్లా కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పోలీస్ స్విమ్మర్ అయిన హెడ్ కానిస్టేబుల్ తులసి చైతన్య కుమార్తె బేబీ తమోఘ్న 5 సంవత్సరాలు, ఈమె జర్మనీ నుండి ఆస్ట్రియాకు 6.3 కి.మీ బోడెన్సీ సరస్సును ఈదిన ప్రపంచంలోనే అతి పిన్న వయస్కురాలుగా రికార్డులకు ఎక్కింది. ఈ నేపథ్యంలో 2026 సం. ఉగాది పురస్కారాలకు ఎంపికై ఉగాది రోజున రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులమీదుగా ఉగాది పురస్కారం అందుకుంది.

## కాచవరం పాఠశాలలో జి.ఎఫ్.ఎల్.ఎన్ సర్వే పరీక్షలు




**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 02 (వార్తా ప్రభ ప్రతినిధి):** ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి ప్రభుత్వం గత డిసెంబర్ 6 నుంచి ప్రారంభించిన గ్యారెంటీడ్ ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమం మార్చి 24వ తేదీతో ముగిసింది. ఈ కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆన్లైన్ పరీక్షలను ఇబ్రహీంపట్నం మండలంలో ప్రారంభించారు. అందులో భాగంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, కాచవరం నందు అంగలూరు ప్రభుత్వ డైట్ ఛాటోపాధ్యాయులు ఆన్లైన్ పరీక్షలను నిర్వహించారు. జి.ఎఫ్.ఎల్.ఎన్ యాక్షన్ ప్లాన్‌ను 75 రోజుల పాటు సమర్థవంతంగా అమలు చేసిన పాఠశాలలను జి.ఎఫ్.ఎల్.ఎన్ పాఠశాలలుగా ప్రకటించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భవాని, ఉర్దూ ఉపాధ్యాయులు మహమ్మద్ ఇర్ఫాన్ పాషా పాల్గొన్నారు.

# అమరావతి శాస్వితత రాజధాని

**సోలాంకి రాజేంద్రకుమార్ జైన్**



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కూటమి ప్రభుత్వం క్యాబినెట్ పిసమావేశంలో అమరావతి రాజధాని శాశ్వత రాజధాని తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపడం, హోం శాఖ మాత్యులు అమిత్ షా ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అని పార్లమెంట్లో ఆమోదించడం శుభపరిణామ మని తెదేపా సీనియర్ నాయకులు రాజు జైన్ హర్షం వ్యక్తం చేశారు. గత పది సంవత్సరాల నుండి ఆంధ్రప్రదేశ్ కు రాజధాని లేక అనేక ఇబ్బందులు పడ్డామని, అమరావతిని శాస్విత రాజధాని గా బిల్లు ఆమోదం హర్షించదగ్గ విషయామని,అమరావతి రాజధాని కోసం పోరాటం చేసిన ప్రతి వక్కరికి విజయోస్తవ శుభాకాంక్షలు ముఖ్యంగా విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ చిన్ని కి హృదయ పూర్వక అభినందనలు తెలియజేస్తున్న ఎన్టీఆర్ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు సోలాంకి రాజేంద్ర కుమార్ జైన్ పత్రిక ప్రకటన లో తెలియజేసారు

## రాజధాని అమరావతికి చట్టబద్ధత - బిల్లు పార్లమెంటులో ఆమోదం పట్ల ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) హర్షం

**ప్రధాని నరేంద్ర మోదీ కి ధన్యవాదాలు తెలిపిన ఎంపీ శివనాథ్**




**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటు ఉభయ సభల్లోనూ బిల్లు ఆమోదం పొందడం పట్ల విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాద్ (చిన్ని ) హర్షం వ్యక్తం చేశారు. అమరావతి రాజధాని చట్టబద్ధత బిల్లు ఆమోదం ఐదు కోట్ల మంది ఆంధ్రులలో పట్టలేని ఆనందాన్ని నింపుతుందన్నారు. ఈ మేరకు ఎంపీ కేశినేని శివనాద్ (చిన్ని ) గురువారం ఒక ప్రకటన విడుదల చేస్తూ.... ఆంధ్ర రాష్ట్ర శాశ్వత రాజధానిగా ఇకపై అమరావతి శాశ్వత కీర్తిని పొంద నుందన్నారు. గత ప్రభుత్వం రాజధాని విషయంలో ఆడిన మూడు ముక్కలాట రాష్ట్ర ప్రజల్లో ఆందోళన కలిగించిందన్నారు. తమ రాష్ట్ర రాజధాని ఏదో కూడా చెప్పుకోలేని దుస్థితిలో నాడు రాష్ట్ర ప్రజలు ఉన్నారన్నారు. ఇటువంటి తరుణంలో ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాజధాని అమరావతి ప్రాంతానికి కంకణ బద్ధులై, రాజధాని అమరావతిని రానున్న కాలంలో సైతం ఎవరు కదపలేని విధంగా శాశ్వత రాజధానిగా చేయడానికి విశేష కృషి చేశారన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో అమరావతికి చట్టబద్ధత బిల్లును స్వయంగా తానే ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా బిల్లు ఆమోదం పొందేలా చేశారన్నారు. అసెంబ్లీ నుంచి పార్లమెంటుకు వచ్చిన ఆ బిల్లు నిన్న లోక్ సభ, నేడు రాజ్యసభ లలో ఆమోదం పొందడం, అమరావతి బిల్లు పార్లమెంటులో ఆమోదానికి వచ్చే సమయంలో తాను అమరావతి ప్రాంత విజయవాడ ఎంపీగా ఉండడం సంతోషంగా ఉందన్నారు. పార్లమెంటు ఉభయ సభలలోను అమరావతి రాజధాని చట్టబద్ధత బిల్లు ఆమోదం పొందేందుకు కృషిచేసిన దేశ ప్రధాని నరేంద్ర మోదీ కి ఈ సందర్భంగా తెలుగు ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఎంపీ కేశినేని చిన్ని తెలిపారు. అమరావతి రాజధాని చట్టబద్ధత కు కృషిచేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు, యువనేత రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.


## వ్యర్థాలను ఎప్పటికప్పుడు తీసేయండి

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమఏప్రిల్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)** వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం ఉదయం తన పర్యటనలో భాగంగా అజిత్ సింగ్ నగర్, సుందరయ్య కట్ట, కండ్రిక జంక్షన్, వేముల శ్యామలాదేవి రోడ్, ఇన్నర్ రింగ్ రోడ్, ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సుందరయ్య కట్ట వద్ద పర్యటించి క్షేత్రస్థాయిలో పారిశుధ్య నిర్వహణ పరిశీలించారు. వ్యర్థాలను ఎప్పటికప్పుడు తీసివేయాలని అధికారులను ఆదేశించారు. కండ్రిక జంక్షన్ ఇన్నర్ రింగ్ రోడ్ వద్ద ఉన్న హిందూ, ముస్లిం, క్రైస్తవ స్మశాన వాటికను క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్కడ కావాల్సిన మౌలిక వస్తువులన్నీ కల్పించాలని, మరమ్మతులన్నీ త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇన్నర్ రింగ్రోడ్ వద్ద జంక్షన్లో హరితాన్ని పెంచాలని డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్ ని ఆదేశించారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.శ్రీనివాస్ రెడ్డి , అసిస్టెంట్ సిటీ ప్లానర్ రాంబాబు సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతోత్సవం



**రాయదుర్గం,ఏప్రిల్ 2 (వార్తాప్రభ):** గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గం గ్రామంలోని ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సంటి సాంబశివ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్,మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమంతుడు భక్తి,బలం,ధైర్యానికి ప్రతీక అని, యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు, మహిళలు,పిల్లలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

# రంగా అభిమానుల సంక్షేమమే ధ్యేయంగా అడుగులు

● రంగా అభిమానుల చర్చించి రాజకీయ రంగ ప్రవేశంపై నిర్ణయం ● రంగాకు నేను అన్నయ్య రెండు కళ్ళు మా మధ్య ఎలాంటి విభేదాలు లేవు ● కొండపల్లి వంగవీటి కుటుంబానికి పుట్టినిల్లు లాంటిది ● కొండపల్లికి ఆహ్వానించిన అల్తాఫ్ బాబాకు ధన్యవాదాలు ● వంగవీటి మోహన్ రంగ కుమార్తె ఆశా కిరణ్ ● శ్రీ శిరిడి సాయిబాబా మందిరం అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్న ఆశా కిరణ్






**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 02 (వార్తా ప్రభ ప్రతినిధి):** పేద ప్రజల ఆరాధ్య దైవం వంగవీటి మోహన్ రంగ అభిమానుల సంక్షేమమే ధ్యేయంగా అడుగులు వేస్తున్నానని, రంగా అభిమానులతో చర్చించి తన రాజకీయ రంగ ప్రవేశం పై నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు రంగా కుమార్తె ఆశా కిరణ్. కొండపల్లిలో హజ్రత్ సయ్యద్ షాబుఖారి నిత్య అన్నదాన లంగర్ఖానా ద్వారా షిరిడి సాయిబాబా మందిరం అన్నసమారాధన కార్యక్రమం పాల్గొన్నారు ఆశా కిరణ్. ఈ సందర్భంగా ఆమెకు ఘన స్వాగతం పలికారు. బీ కాలనీ వద్దగల రంగా విగ్రహానికి ఆశ కిరణ్ మరియు అల్తాఫ్ బాబా పూలమాలవేసి నివాళులర్పించారు. సాయి బాబా గుడి లో ధర్మకర్త రాంబాబు ఆశ కిరణ్ దంపతులను బాబా కండువా మరియు చిత్రపటం తో సత్కరించారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆప్యాయంగా మహిళలకు స్వయంగా భోజనం వడ్డించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వంగవీటి మోహనరంగా అభిమానులు తెలుగు రాష్ట్రాలలో, అన్ని పార్టీలలో, కుల మతాల అతీతంగా ఉన్నారని అన్నారు. వారి సంక్షేమం చూడవలసిన బాధ్యత రంగా కుమార్తెగా తనపై ఉందని అన్నారు. అందుకే రంగా– రాధా మిత్రమండలిని బలోపేతం చేస్తూ రంగా అభిమానులను ఏకతాటిపై తెచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నానని అన్నారు. రంగా కు రాధా తాను రెండు కళ్ళు లాంటి వాళ్ళమని తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని, తన ప్రయాణానికి అన్నయ్య పూర్తి మద్దతు ఉందని అన్నారు. రంగా అభిమానులను అందరితో చర్చించిన తర్వాత రాజకీయ రంగ ప్రవేశంపై నిర్ణయం తీసుకుంటానని స్పష్టం చేశారు. కొండపల్లి వంగవీటి కుటుంబానికి పుట్టినిల్లు లాంటిదని, ఇక్కడికి రావడం, ప్రజల ఆప్యాయత చూస్తుంటే సంతోషకరంగా ఉందని చెప్పారు. కొండపల్లి ఆహ్వానించిన సూఫీ మత గురువులు అల్తాఫ్ బాబా కు ధన్యవాదాలు తెలిపారు. అల్తాఫ్ బాబా మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే శ్వాసగా జీవించిన రంగా అభిమానులకు, పేద ప్రజలకు సేవలు అందించాలని లక్ష్యంతో ముందుకొచ్చిన ఆశా కిరణ్ ను అభినందించారు, షాబుఖారి బాబా, షిరిడి సాయిబాబా, ఏసుప్రభు ఆశీస్సులతో ఆమె ఉన్నత స్థాయి పదవులు అధిరోహించి తండ్రికి తగ్గ కూతురు లాగా పేద ప్రజలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. తాము సూఫీ ఇజాన్ని ఆచరిస్తూ దైవమార్గంలో ఉన్నామని,సేవ చేయటమే తన లక్ష్యమని తమకు ఎలాంటి రాజకీయాలతో సంబంధం లేదని ప్రశ్నకు జవాబుగా చెప్పారు.

## అమరావతికి పార్లమెంట్ చట్టబద్ధత కేంద్రానికి కృతజ్ఞతలు

**బీజేపీ నాయకులు కోటప్రోలు కృష్ణ**



**ముదినేపల్లి ఏప్రిల్ 2 (వార్తా ప్రభ)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అమరావతిని రాజధానిగా పార్లమెంట్ ద్వారా చట్టబద్ధత కల్పించినందుకు కేంద్ర ప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు బీజేపీ సీనియర్ నాయకులు కోటప్రోలు కృష్ణ పేర్కొన్నారు.ముదినేపల్లి లోని బీజేపీ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం అమరావతిని కుట్రపూరితంగా నిర్వీర్యం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించిందని తెలియజేశారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వ మద్దతుతో, కేంద్ర సహకారంతో అమరావతి రాజధానిగా మళ్లీ ఆమోదం పొందడం చారిత్రాత్మక నిర్ణయమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇది బీజేపీ పార్టీ కృషి ఫలితమని స్పష్టం చేశారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా రాష్ట్ర ప్రజల సంక్షేమానికి అండగా నిలుస్తోందని, దేశాన్ని అగ్రగామిగా నిలబెట్టేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విశేష కృషి చేస్తున్నారని తెలిపారు.అలాగే, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుచూపు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మద్దతుతో, బీజేపీతో కలసి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజాసేవలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.అమరావతి రాజధాని పునరుద్ధరణ కూటమి ప్రభుత్వ తొలి విజయంగా నిలిచిందని, ఇది రాష్ట్ర అభివృద్ధికి నాంది పలుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.అమరావతిని రాజధానిగా ఆమోదించేందుకు సహకరించిన కేంద్ర ప్రభుత్వం మరియు పార్లమెంట్‌లో మద్దతు తెలిపిన అన్ని పార్టీలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## లాభాల బాటలో కేడీసీసీ బ్యాంక్.

**రైతు సంక్షేమమే కేడీసీసీ బ్యాంకు లక్ష్యం.**

**నెట్టెం శ్రీ రఘురాం కృష్ణా డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఛైర్మన్.**



**మచిలీపట్నం** ఏప్రిల్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)కృష్ణా డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ లిమిటెడ్ లాభాల బాటలో పయనిస్తూ రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచిందని కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురాం అన్నారు. గురువారం కేడీసీసీ బ్యాంకు కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు, సన్న కారు రైతుల సంక్షేమమే తమ బ్యాంకు లక్ష్యం అన్నారు. 2025- 26 సంవత్సరం బ్యాంకు అభివృద్ధిపై ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను బ్యాంకు ఛైర్మన్ గా కేడీసీసీ బ్యాంకుకు వచ్చి సంవత్సరం అవుతున్నట్లుగా తెలియజేశారు. బ్యాంకు సీఈఓ సిబ్బంది బ్యాంకు అభివృద్ధిలో తనకు అందిస్తున్న సహకారానికి ధన్యవాదాలు తెలిపారు. బ్యాంకు షేర్ క్యాపిటల్ 453.94 కోట్లు, రిజర్వ్ ఫండ్ 443.95 కోట్లతో 2025-26 సంవత్సరం సొంత నిధులు మొత్తం 897.88 కోట్ల అభివృద్ధికి చేరాయని అన్నారు. అభివృద్ధి బాటలో కేడీసీసీ బ్యాంకు పని చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయిలో తాము ప్రథమ స్థానంలో నిలిచామని సగర్వంగా తెలిపారు. సొంత నిధుల గ్రోత్ గతంలో కన్నా 12.2% కి వృద్ధి చెందిందన్నారు. మొత్తం బ్యాంకు డిపాజిట్స్ 3,850.76 కోట్లు, లోన్లు అడ్వాన్సులు 8618.63 కోట్లు తో మొత్తం బ్యాంకు వ్యాపారం 12,469.39 కోట్లకు చేరిందన్నారు. గతంలో కన్నా 7.17% వృద్ధి నమోదు తో బ్యాంకు ముందంజలో ఉండటం గర్వకారణంగా ఉందన్నారు. బారోయింగ్స్ 6646.38 కోట్లతో గతంలో కన్నా 1.54 శాతం అభివృద్ధి వైపు పయనిస్తోంద న్నారు. ఇన్వెస్ట్మెంట్లు 200863.13 కోట్లకు చేరిందని, 13. 36% అభివృద్ధిలో సాగుతోందన్నారు. తీసుకున్న వడ్డీలు 948.17 కోట్లకు చేరి 4.76% వృద్ధిలో పయనిస్తోందన్నారు. మిస్లీనియస్ ఇన్కమ్ 19.48 కోట్లు గా ఉందన్నారు. బ్యాంక్ ఎస్టాబ్లిష్మెంట్ ఎక్స్పెండిచర్ 91.26 కోట్లు ఖర్చయింది అన్నారు. బ్యాంక్ ఆపరేటింగ్ ఎక్స్పెండిచర్ 52.78 కోట్లు, ప్రాఫిట్ బిఫోర్ టాక్స్ 105.99 కోట్లకు చేరి, 4.88% వృద్ధిరేటు నమోదు చేసుకుందన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో చాట్రాయి, తోట్లవల్లూరు, కాటూరు బ్యాంకు శాఖలలో 100% వసూళ్లు సాధించడం పట్ల సిబ్బందిని అభినందించారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి తిరిగి వారం రోజుల్లో మళ్ళీ వెంటనే పొందవచ్చున్నారు. రైతులు పంట రుణమాఫీ కింద జూన్ 30 లోపు క్లైమ్ పెట్టుకోవాలని అన్నారు. రైతు సంక్షేమమే తమ బ్యాంకు లక్ష్యమని, సన్న చిన్న కారు రైతులకు చిరు వ్యాపారులకు తమ బ్యాంకు ఎల్లవేళలా అండదండల అందిస్తుందని ఛైర్మన్ నెట్టెం రఘురాం అన్నారు. చనిపోయిన రైతులకు డెత్ లైన్లు సకాలంలో అందిస్తామన్నారు. అయితే సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని వారికి జీవిత బీమా కూడా అమలు చేస్తాం అనే తెలిపారు. చిన్న సన్నకారు రైతులు ఎవరైనా అనారోగ్య కారణాల వల్ల గాని మరే ఇతర కారణాల వల్ల గాని, వృద్ధాప్యం వల్ల గాని మరణిస్తే వారి కుటుంబానికి మట్టి ఖర్చులు నిమిత్తం పదివేల రూపాయలు దహన సంస్కారాల ఖర్చులను కూడా అందజేస్తామన్నారు.రైతులు తమ ఇన్సూరెన్స్ పాలసీని ఎప్పటికప్పుడు రెన్యువల్ చేసుకోవాలని తెలిపారు.ఈ సందర్భంగా బ్యాంకు సంక్షేమం, అభివృద్ధి కి చిత్తశుద్ధితో పాటుపడిన ఉద్యోగులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. తమ హయాంలో కేడీసీసీ బ్యాంకును లాభాల బాటలో పయనింప చేస్తామని, అన్నారు. డిపాజిట్ల సేకరణలో కూడా బ్యాంకు అగ్రభాగాన నిలవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు సీఈవో శ్యామ్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన కోర్సులు సద్వినియోగం చేసుకోండి.

**కృష్ణా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కూన రాంజి.**



**మచిలీపట్నం** ఏప్రిల్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా కృష్ణా యూనివర్సిటీలో నూతన కోర్సులు ప్రవేశపెట్టడం జరుగుతోందని, విద్యార్థిని విద్యార్థులకు ఇవి ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని కృష్ణా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కూన రాంజీ అన్నారు.యూనివర్సిటీ పరిధిలోని విజయవాడలో డాక్టర్ ఎన్టీఆర్ పీజీ సెంటర్‌లో "డిప్లమా ఇన్ హాస్పిటాలిటీ ఉ హాస్పిటల్ మేనేజ్‌మెంట్" కోర్సును గురువారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కూన రాంజీ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు ఈ కోర్సు ద్వారా ఎంతో లబ్ధి పొందవచ్చున్నారు. యూనివర్సిటీలో అందించే వివిధ రకాల కోర్సులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెక్టర్ ప్రొఫెసర్ ఎం.వి. బసవేశ్వర్ రావు, ప్రొఫెసర్ ఉజ్వల్ గటక్ (రాయలసీమ ఫిజియోథెరపీ సెంటర్), ప్రొఫెసర్ సుజిత్ కుమార్ (నేవీ కమాండో), అలాగే ఎన్టీఆర్ పీజీ సెంటర్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ దిలీప్ ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. అధ్యక్షులు రాంజీ మాట్లాడుతూ, 2026--27 విద్యా సంవత్సరంనుంచి సమాజానికి అత్యవసరమైన పలు కొత్త కోర్సులను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

## మండలంలో పంచాయతీల ప్రత్యేకాధికారుల నియామకం

**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 02 (వార్తా ప్రభ ప్రతినిధి):** మండల పరిధిలోని పంచాయతీల పాలక మండల్ పదవీకాలం ముగియడంతో ఆయా పంచాయతీలకు అంతేకాధికారులను జిల్లా కలెక్టర్ లక్ష్మి శా నియమించారు.చిలుకూరు, దాములూరు,కాచవరం పంచాయతీలకు ప్రత్యేకాధికారిగా డిప్యూటీ ఎంపీడీవో మనోజ్, ఈలప్రోలు పంచాయతీకి మండల వ్యవసాయ శాఖ అధికారి వై.రజిని, గుంటుపల్లి, తుమ్మలపాలెం పంచాయతీలకు ఎంపీడీవో డి.శకుంతల, జూపూడి పంచాయతీకి తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు, కేతనకొండ, కొటికలపూడి పంచాయతీలకు ఎంజీవో, జీఎస్ డబ్ల్యూఎస్ బి.ప్రసాద్, మూలపాడు పంచాయతీకి పంచాయతీరాజ్ ఏఈఈ ఎన్.నాగేశ్వరరావును నియమిస్తూ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ గురువారం ఆదేశాలు జారీ చేశారు.

## వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

**ఛైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు**



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 02 (వార్తా ప్రభ ప్రతినిధి):** వేసవిలో కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి అద్దరి లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు ఆదేశించారు కొండపల్లి మున్సిపల్ ఛైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు. కలెక్టర్ లక్ష్మీశా సూచనలతో కొండపల్లి పురపాలక కమీషనర్ బి శ్రీనివాస్,పురపాలక ఛైర్మన్ గురువారం పంప్ హౌస్ను పరిశీలించారు.ఈ సందర్భంగా వేసవి కాలంలో మంచి నీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆర్ డబ్ల్యూ ఎస్ సిబ్బందిని ఆదేశించారు. మంచినీటిని సరిగా శుద్ధి చేయడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమం లో కొండపల్లి పురపాలక వైస్ ఛైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావు, మునిసిపాలిటీ సిబ్బంది,ఆర్డబ్ల్యూఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ సమస్యల పరిష్కారం.

**- ఆల్విన్ కాలనీ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి.**





**కూకట్ పల్లి,ఏప్రిల్ 2(వార్తాప్రభ):** వివేకానంద నగర్ డివిజన్ పరిధిలో రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధి లో రోడ్లపై పేరుకుపోయిన మట్టిప్పలు చేసే కార్యక్రమానికి ముఖ్య అతిథి ఆల్విన్ కాలనీ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి సిబ్బంది పాల్గొని శుభ్రం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి మాట్లాడుతూ మా కాలనీ సమస్యలు విజయవంతం చేయుటకు మున్సిపల్ అధికారులు అందుబాటులో ఉండి ఏ సమస్య అయినా క్షణాల్లో పరిష్కరించడానికి శ్రేయ శక్తుల కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు నర్సింగరావు, సూర్యనారాయణ, శ్రీధర్, ప్రసాద్, కమిటీ సభ్యులు కాలనీవాసులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా శ్రీ సంజీవిని హనుమాన్ దేవాలయం 30వ వార్షికోత్సవం

**హనుమాన్ జయంతి వేడుకలు**

**- ఆలయ ఛైర్మన్ గూడేపు కొండల్ రావు**



**కూకట్ పల్లి,ఏప్రిల్ 2(వార్తాప్రభ):** కూకట్ పల్లి నియోజకవర్గం బాలాజీ నగర్‌లోని శ్రీ సంజీవిని హనుమాన్ దేవాలయంలో 30వ వార్షికోత్సవం మరియు హనుమాన్ జయంతి సందర్భంగా వేడుకలు భక్తి శ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడాయి. ఆలయ ఛైర్మన్ గూడేపు కొండల్ రావు మరియు గూడేపు నాగరాజు ఆహ్వానం మేరకు ప్రముఖులు యక్కంటి వెంకటరెడ్డి ఆలయానికి విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, హనుమాన్ స్వామి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా యక్కంటి వెంకటరెడ్డి మాట్లాడుతూ, హనుమాన్ స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. వేడుకలలో స్థానిక భక్తులు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తి భావాన్ని చాటారు. ఆలయ కమిటీ సభ్యులు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించగా భక్తులకు అన్నదానం, తీర్థప్రసాదాలు అందించారు.

## రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లు పార్లమెంటులో ఆమోదం

● విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్లో టిడిపి శ్రేణుల సంబరాలు

● బాణా సంచా కాల్చి, మిఠాయిలు పంచుతూ హర్షాతిరేకాలు







**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందటంతో విజయవాడ పార్లమెంటు కార్యాలయం ఎన్టీఆర్ భవన్లో టిడిపి శ్రేణుల సంబరాలు మిన్నంటాయి. గురువారం సాయంత్రం ఎన్టీఆర్ భవన్ వద్ద బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుంటూ టిడిపి శ్రేణులు సంతోష సంబరాలు జరుపుకున్నారు. టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహానికి నివాళులర్పించి జయహో అమరావతి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్ మాట్లాడుతూ.... పార్లమెంటులో అమరావతికి చట్టబద్ధత ఒక చారిత్రాత్మక ఘట్టం అన్నారు. అమరావతి రాజధానిగా ప్రపంచ స్థాయి గుర్తింపు లభించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయాల వల్ల అమరావతి లిప్రపంచ స్థాయి రాజధానులలో నంబర్ వన్ రాజధానిగాలి అమరావతి మారుతోందని చెప్పారు. రైతుల పోరాటం మరియు కష్టాలు … అమరావతి నిర్మాణంలో దాగి ఉన్నాయన్నారు. గత ప్రభుత్వ పాలనలో రైతులు దాదాపు లి1600 రోజులకు పైగా సుదీర్ఘ పాదయాత్రలి (అమరావతి నుండి తిరుపతి) చేసి అమరావతిని కాపాడుకున్నారన్నారు. రైతన్నలు లాఠీ దెబ్బలు, జైలు శిక్షలు సైతం లెక్క చేయక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. 2024 లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమరావతికి పూర్వవైభవం వచ్చిందనీ, అమరావతి రాజధాని నిర్మాణం చరవేగంగా జరుగుతుందన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని అమరావతికి చట్టబద్ధత కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నడుం బిగించారని అన్నారు.ప్రస్తుతం అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపిందన్నారు.అమరావతికి పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, రైతులు సంబరాలు చేసుకుంటున్నారన్నారు. అమరావతి ప్రాంతంలోని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పార్లమెంట్‌లో ఈ బిల్లు ఆమోదంకి పూర్తి మద్దతు కోసం విశేష కృషి చేశారన్నారు. ఎంపీ కేశినేని చిన్నితో అమరావతి బిల్లుకు మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుగు ప్రజల పక్షాన తెలుపుతున్నట్లు భవ కుమార్ తెలిపారు. తెలుగు ప్రజలంతా సంతోషం వ్యక్తం చేస్తుంటే నేటికీ వైసీపీ అమరావతిపై విషం కక్కుతూనే ఉందన్నారు.నగరపాలక సంస్థ టిడిపి మాజీ ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి మాట్లాడుతూ...అమరావతి చట్టబద్ధతకు కృషిచేసిన దేశ ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,యువ నేత నారా లోకేష్ , బిజెపి నేత అమిత్ షా తదితర నాయకులకు తెలుగు ప్రజలంతా ధన్యవాదాలు తెలుపుతున్నారు అన్నారు.టిడిపి రాష్ట్ర నాయకులు మాదిగాని గురునాథం మాట్లాడుతూ... పార్లమెంటులో బిల్లు సమయంలో అమరావతి చరిత్ర ఎంపీల నోటి వెంట వింటుంటే తెలుగు జాతి ఘన చరిత్ర ఎంత ఘనమైందో ప్రపంచానికి మరోసారి తెలిసిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతి ఇకపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో... ఉడా మాజీ ఛైర్మన్ తూమాటి ప్రేమ్ నాథ్, మాజీ కార్పొరేటర్ లు దేవినేని అపర్ణ, చెన్నుపాటి ఉషారాణి, జాస్తి సాంబశివరావు , టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు కొట్టేటి హనుమంతరావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చరణ్ సాయి యాదవ్, మార్కెట్ యార్డు కమిటీ ఉపాధ్యక్షులు పాల మాధవ, మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫైజాన్, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు ఇర్ఫాన్, టిడిపి జిల్లా కార్యదర్శి పిళ్ళ శ్రీనివాస రావు, టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పరిసపోగు రాజేష్, లీగల్ సెల్ నాయకులు ఎర్నేని వేదవ్యాస్, శాప్ డైరెక్టర్ సంతోష్, గవర్నమెంట్ హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, ఎన్ఐఆర్ డి అర్బన్ కోఆర్డినేటర్ నరసింహ చౌదరి, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి ఆనంద్ స్వరూపు, టి ఎన్ టి యు సి జిల్లా కార్యదర్శి కోడూరు ఆంజనేయ వాసు , పార్టీ సీనియర్ నాయకులు కొల్లి శ్రీనుబాబు , కోనేరు కిషోర్ బాబు , పెద్ద సంఖ్యలో మహిళ కార్యకర్తలు, నాయకులు, విజయవాడ అర్బన్ లోని వివిధ డివిజన్ల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్ ఇంచార్జిలు తదితరులు పాల్గొన్నారు.

## చేజర్ల లో అంబరాన్నంటిన కూటమినేతల సంబరాలు

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల గౌరవం రాజధాని అమరావతి....చేజర్ల కూటమి నేతలు**



**చేజర్ల** ఏప్రిల్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి)చేజర్ల మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు సంబరాలు జరుపుకున్నారు రాష్ట్ర ప్రభుత్వం పంపిన అమరావతి రాజధాని అంశంపై కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత చేయడంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి శాశ్వత రాజధానిగా అమరావతి పేరును ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేయడంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు రైతులు యువత పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకుంటున్నారు ఈ సందర్భంగానే చేజర్లలో కూటమి నేతలు వారి వారి పార్టీ జెండాలు ఎగరవేస్తూ ర్యాలీగా బయలుదేరి బస్టాండ్ ఆవరణ మొత్తం ఘనంగా ఒకరికొకరు సంతోషం వెల్లబుచ్చుకుంటూ సంబరాలు జరుపుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో చేజర్ల మండల సీనియర్ నాయకులు మాజీ మండల అధ్యక్షులు రావి పెంచలరెడ్డి మరియు చేజర్ల మాజీ సర్పంచ్ రావి లక్ష్మీనరసిరెడ్డి చేజర్ల సొసైటీ ఛైర్మన్ బూదళ్ళ వీర రాఘవరెడ్డి తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ మండల నాయకులు సోమవరపు హజరత్ మరియు కార్యకర్తలు యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రాజధాని ఏమిటో చెప్పుకునే పరిస్థితి కూడా ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు అయోమయంగా ఉండేదని గత ప్రభుత్వం మూడు రాజధానులు అంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి దశ దిశ లేకుండా చేయడం ఆంధ్ర రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యమని తెలిపారు ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటినుండి ప్రజలకు మేలు చేస్తూ సంక్షేమ పథకాలు అందిస్తూ ఆంధ్ర రాష్ట్రానికి శాశ్వత రాజధానిగా అమరావతి పేరును చిరస్థాయిగా నిలిచిపోయేలా చేయడం ఆంధ్ర రాష్ట్ర ప్రజల గౌరవాన్ని ఈ కూటమి ప్రభుత్వం నిలబెట్టిందని ఈ సందర్భంగా వారు తెలిపారు.

## మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా 'బంటు నరేష్'

**టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ. వెంటనే అమల్లోకి రానున్న నూతన కార్యవర్గ నియామకాలు. హర్షం వ్యక్తం చేస్తున్న నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు.**



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 2, (వార్తాప్రభ) :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా విభాగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేసింది. ఇందులో భాగంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ప్రకటిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ప్రతిష్టాత్మక జాబితాలో నియోజకవర్గానికి చెందిన చురుకైన నాయకుడు బంటు నరేష్ కు కీలక బాధ్యతలు దక్కాయి.

**ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు** జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ సంప్రదింపుల మేరకు, బంటు నరేష్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శి గా నియమించారు. పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషిని గుర్తించి ఈ పదవిని కట్టబెట్టినట్లు తెలుస్తోంది. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని పార్టీ ఉత్తర్వుల్లో పేర్కొంది.

**శుభాకాంక్షల వెల్లువ** బంటు నరేష్‌కు జిల్లా స్థాయిలో కీలక పదవి దక్కడం పట్ల కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, బండి శ్యామ్ గౌడ్, మరియు ఇతర సీనియర్ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం బంటు నరేష్ తన వంతు కీలక పాత్ర పోషిస్తారనఆశాభావం వ్యక్తం చేశారు తనకు ఇంతటి కీలకమైన బాధ్యతకు కారణమైన కొలన్ హన్మంత్ రెడ్డి, మరియు బండి శ్యామ్ గౌడ్ కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## మేయర్ గణేష్ కు గజమాలతో సన్మానం



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా** ఏప్రిల్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి) కొత్తగూడెం, ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రవేశపెట్టినప్రజా పాలనలోని వార్డు సభ కార్యక్రమం లో పాల్గొన్న కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడు గణేష్ కి గజమాలతో బాల వరసిద్ధి విగ్నేశ్వర కమిటీ ఆధ్వర్యంలో గజమాలతో ఘన సన్మానం అనంతరం 56వ డివిజన్ కార్పొరేటర్ శాంతి ప్రియా కి సెలవుతో సత్కరించారు ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఆప్తా మిత్రుడు జనపనేని రామసత్యనారాయణ అందే, సమ్మయ్యగారు , గాజుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

## హనుమంతుడు భక్తికి ప్రతిక.

**-శాసనసభ్యులు అరికెపూడి గాంధీ**



**శేరిలింగంపల్లి,ఏప్రిల్ 2 (వార్తాప్రభ):** హనుమాన్ జయంతి సందర్భంగా శేరిలింగంపల్లి డివిజన్ లింగంపల్లిలో నిర్వహించిన హనుమాన్ శోభాయాత్రలో పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని సీనియర్ నాయకుడు చింతకింది రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ హనుమంతుడు భక్తికి ప్రతీకగా నిలిచాడని, రామాయణంలో ఆయన పాత్ర అపారమని పేర్కొన్నారు. ప్రజలందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, నాయకులు రఘునాథ్ రెడ్డి, మారబోయిన రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులకు మజ్జిగ, పానకం పంపిణీ

**-మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు**



**కూకట్ పల్లి;ఏప్రిల్ 2(వార్తాప్రభ):** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కూకట్ పల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ చౌరస్తాలో హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులకు మజ్జిగ, పానకం పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాచర్ల భద్రయ్య ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హనుమాన్ జయంతి వంటి పర్వదినాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించడం సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమల ప్రసన్న నగర్ మాజీ అధ్యక్షులు శేఖర్,ప్రదీప్ రెడ్డి, జగదీష్, రవీందర్రావు, రమేష్, నరహరి గౌడ్, మారుతి ప్రసాద్, అఖిల్, కళ్యాణ్, రాకేష్, జైహింద్, సోనాల్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. భక్తులకు చల్లని మజ్జిగ, పానకం పంపిణీ చేయడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

# జనం చెంతకు ఎమ్మెల్యే!!

**● ప్రజల భాగస్వామ్యంతోనే ప్రగతి ● వార్డు సభల్లో ప్రజా గళానికి పెద్దపీట ● సమస్య ఏదైనా.. పరిష్కారం తక్షణమే ● మౌలిక సదుపాయాలే లక్ష్యం ● రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**





**పెద్దపల్లి/ గోదావరిఖని: ఏప్రిల్ 2 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ గురువారం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 8, 47, 48, 49 డివిజన్లలో నిర్వహించిన "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" వార్డు సభల్లో ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రజల భాగస్వామ్యంతోనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఉద్ఘాటిస్తూ, స్థానిక సమస్యలను నేరుగా ప్రజల నోటి నుండే విని వాటి పరిష్కారానికి అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి డివిజన్‌లోని వీధులను పర్యవేక్షిస్తూ మహిళలు, వృద్ధులు, స్థానిక యువతతో మమేకమై తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ, రహదారుల పరిస్థితి, పారిశుధ్య నిర్వహణపై ఆరా తీశారు. ప్రజాపాలన లక్ష్యం కేవలం పథకాలు అందించడమే కాకుండా, సామాన్యుడి గొంతును ప్రణాళికా రచనలో భాగం చేయడమేనని స్పష్టం చేసిన ఆయన, పెండింగ్‌లో ఉన్న ప్రతి సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను హెచ్చరించారు. ముఖ్యంగా విద్య, వైద్య రంగాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇస్తూ, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ పర్యటనలో ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరిస్తూ, అభివృద్ధి ఫలాలు ప్రతి గడపకూ అందేలా నిరంతరం శ్రమిస్తానని భరోసా ఇచ్చారు. రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, మున్సిపల్ కమిషనర్‌తో కలిసి వార్డుల్లో కలియతిరిగిన ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే ఆదర్శవంతమైన నియోజకవర్గాన్ని నిర్మించగలమని అన్నారు. భారీ సంఖ్యలో తరలివచ్చిన స్థానికులతో వార్డు సభలు సందడిగా మారగా, తమ సమస్యలను ఎమ్మెల్యే స్వయంగా వినడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో మరిన్ని డివిజన్లలో ఇటువంటి ప్రత్యక్ష చర్చా వేదికలు నిర్వహిస్తామని, పారదర్శకమైన పాలన అందించడమే తన లక్ష్యమని రాజ్ ఠాకూర్ పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధికారులు, రాజకీయ నాయకులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అభివృద్ధి ప్రణాళికల్లో ప్రజాభిప్రాయానికే అగ్రతాంబూలం ఇస్తామని ఎమ్మెల్యే భరోసా ఇవ్వడంతో ఈ పర్యటన ముగిసింది.

## చుంచుపల్లి పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

**సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను నిత్యం అప్రమత్తం చేస్తూ ఉండాలి**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా** ఏప్రిల్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి) కొత్తగూడెం,జిల్లా ఎస్పీ రోహిత్ రాజు గురువారం చుంచుపల్లి పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు,సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చుంచుపల్లి పోలీస్ స్టేషన్ పైన ఉన్న డిస్ట్రిక్ట్ సైబర్ క్రైమ్స్ కో-ఆర్డినేషన్ సెంటర్ ను సందర్శించారు. ఇప్పటివరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో నమోదైన సైబర్ నేరాల వివరాలను అట్టి కేసుల పురోగతిని గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా జిల్లాలోని పోలీసు అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం పాటిస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సైబర్ క్రైమ్ కో-ఆర్డినేషన్ సెంటర్ అధికారులకు సూచించారు. కంటికి కనపడకుండా ఆన్లైన్ ద్వారా సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించేలా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా జిల్లా ప్రజలను ఎప్పటికప్పుడు ఆ ప్రభుత్వం చేస్తూ విస్తృతస్థాయిలో ప్రచారం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ,సైబర్ క్రైమ్స్ డిఎస్పీ అశోక్,సీఐ జితేందర్,చుంచుపల్లి ఎస్సైలు రవి,ఉమ మరియు ఎస్సై జుబేదా,సిబ్బంది పాల్గొన్నారు.

## గుట్ట మైసమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే కూనంనేని

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా** ఏప్రిల్ 2 :(వార్తా ప్రభ ప్రతినిధి) సుజాతనగర్, సుజాతనగర్ ప్రాంత అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నామని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు గురువారం మండలంలోని సింగభూపాలెం గ్రామంలో గల గుట్ట మైసమ్మ తల్లిని దర్శించుకున్నారు సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి దయవల్ల అందరూ చల్లగా ఉండాలని లైన్ తండా నుండి గుట్ట మైసమ్మ తల్లి ఆలయ వరకు వెళ్లే రోడ్డును బిటి రోడ్డుగా మంజూరు చేయడం కొరకు పై అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారాన్ని కృషి చేస్తామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా మేయర్ మూడు గణేష్ జిల్లా కార్యవర్గ సభ్యులు భూక్యా దశ్రు సిపిఐ నాయకులు పొదిల శ్రీనివాసరావు తాళ్లూరు ధర్మరావు సిపిఐ నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రజాసంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు



## రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్ లోక్‌సభలో ఆమోదం పొందినందుకు- కార్పొరేషన్ లో వేడుకలు



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 2** :(వార్తా ప్రభ ప్రతినిధి)రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్ లోక్సభలో ఆమోదం పొందినందుకు విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ధ్యానచంద్ర ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి కు చట్టబద్ధత బిల్ లోక్సభ ఆమోదం పలికినందుకు ఈ వేడుకలు జరుపుకుంటున్నామని, నగరంలోని జోనల్ కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు, వసతి గృహాలులో కూడా ఈ వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డాక్టర్ డి చంద్రశేఖర్, ఏ రవీంద్రరావు, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కే అర్జునరావు, చీఫ్ ఇంజనీర్ ఇంచార్జ్ పి సత్యకుమారి, ప్రాజెక్ట్ ఆఫీసర్ యు సి డి విజయలక్ష్మి, అకౌంట్స్ ఆఫీసర్ బి సత్యనారాయణమూర్తి, అకౌంట్స్ ఎగ్జామినర్ చక్రవర్తి, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ లు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ గోపాల నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆంధ్ర రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ లో సెక్యూరిటీ గార్డుల చేరిక




**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 2 (వార్తా ప్రభ ప్రతినిధి):** ఎన్టీటీపీఎస్ కాలనీల్లో సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న 29 మంది గురువారం ఆంధ్ర రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ (బీఎంఎస్)లో చేరారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌటిపల్లి రామ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ కాలనీ సెక్యూరిటీ గార్డులకు జీవో 129 ప్రకారం వేతనాలు చెల్లిస్తున్నప్పటికీ, ఆ జీవో ప్రకారం రావలసిన ఇతర ప్రయోజనాలు, బయోమెట్రిక్ సౌకర్యం లేకపోవడంతో ఆంధ్ర రాష్ట్ర ఎంప్లాయిస్ యూనియన్ బయోమెట్రిక్ ను సాధించడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించడంలో విజయం సాధించిందన్నారు. అనంతరం కార్యక్రమం ముఖ్య అతిథులను సెక్యూరిటీ గార్డులు సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ రీజనల్ సెక్రటరీ పి.బాలకృష్ణ, సిహెచ్.హనుమయ్య, మల్లేశం, బీజేపీ సీనియర్ నాయకుడు నూతులపాటి బాల కోటేశ్వరరావు, కొండపల్లి పట్టణ అధ్యక్షురాలు తమ్మినేని మాధురి సుధీష్ణ, గొల్లపూడి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కాటంనేని చైతన్య, తిరుపతి నాయుడు, ఎస్సీ మోర్చా ఇబ్రహీంపట్నం రూరల్ మండల అధ్యక్షురాలు కల్పన, మున్సిపాలిటీ సెక్రటరీ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి తాపం.. జాగ్రత్తలు తప్పనిసరి!!

**● వేసవి ఆరోగ్య రక్షణపై అవగాహన సదస్సు ● ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి ● తాజా పండ్లు, పౌష్టికాహారమే వేసవికి శ్రీరామరక్ష ● వేసవిలో మద్యం, శీతల పానీయాలకు దూరంగా ఉండండి ● ఆరోగ్య అధికారి డాక్టర్ కె. పద్మ**



**పెద్దపల్లి/ గోదావరిఖని: ఏప్రిల్ 2 (వార్తాప్రభ ప్రతినిధి)** సింగరేణి రామగుండం ఆర్.జి-1 ఏరియా హాస్పిటల్ ఏసీఎంఓ డాక్టర్ అంబికా ఆధ్వర్యంలో గురువారం జి.డి.కె 11 ఇంక్ గని వద్ద ఉద్యోగులకు వేసవి ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య అధికారి డాక్టర్ కె. పద్మ మాట్లాడుతూ, ఎండల తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా కార్మికులు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నిరంతరం నీరు, మజ్జిగ, నిమ్మరసం, ఓ.ఆర్.ఎస్ వంటి ద్రవ పదార్థాలను అధికంగా సేవించాలని సూచించారు. ఎండలోకి వెళ్లేటప్పుడు తప్పనిసరిగా టోపీ, గొడుగు, తలపాగా ధరించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడాలని ఆమె కోరారు. శీతల పానీయాలు, మద్యం, ధూమపానానికి దూరంగా ఉండాలని, తాజా పండ్లు, కూరగాయలతో కూడిన పౌష్టికాహారం తీసుకోవాలని ఆమె వివరించారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రథమ చికిత్స పొందాలని కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గని ఏజెంట్ చిలుక శ్రీనివాస్, గ్రూప్ ఇంజనీర్ బి. రాందాస్, గని మేనేజర్ బి. మల్లేశం, పిట్ ఇంజనీర్ డి. రాకేష్, సంక్షేమ అధికారి రవీందర్, పిట్ సెక్రెటరీ నాయిని శంకర్ తదితర అధికారులు, సూపర్ వైజర్లు, కార్మికులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వం లో వేగ వంతంగా అభివృద్ధి కార్యక్రమాలు

**ప్రభుత్వ విప్ అరికేపూడి గాంధీ**



**కొండాపూర్,ఏప్రిల్ 2 (వార్తాప్రభ):** కొండాపూర్ డివిజన్ మాధవ హిల్స్ కాలనీలో రూ.95 లక్షల వ్యయంతో అభివృద్ధి చేసిన మెట్ల బావి పార్క్‌ను పిఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. హమీద్ పటేల్ ప్రాంత అభివృద్ధికి కృషి కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు,స్థానిక నాయకులు,కాలనీ వాసులు పాల్గొన్నారు

## పబ్లిక్ ట్రాన్స్ పోర్ట్ వినియోగాన్ని పెంచాలి - పోలీసు వర్గాలు





**శేరిలింగంపల్లి,ఏప్రిల్ 2 (వార్తాప్రభ):** ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ రద్దీపై మాదాపూర్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన సర్వేలో కీలక అంశాలు బయటపడ్డాయి. సైబర్ టవర్స్ పరిసరాల్లో గంట వ్యవధిలో నిర్వహించిన సర్వేలో 10,138 మంది సింగిల్ రైడర్లు, కేవలం 3,584 మంది డబుల్ రైడర్లు ఉన్నట్లు గుర్తించారు. సింగిల్ రైడర్ల అధికత వల్ల ట్రాఫిక్ జామ్‌లు,ఇంధన వ్యయం, కాలుష్యం పెరుగుతున్నట్లు పోలీసులు తెలిపారు. రైడ్ షేరింగ్, కార్ పూలింగ్,పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వినియోగాన్ని పెంచాలని సూచించారు. ఈ సర్వేలో ట్రాఫిక్ అధికారులు,సిబ్బంది పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు.

## అమరావతి రాజధాని బిల్లుకు ఆమోదం ప్రజలకు పండుగ రోజు ఆండ్రాజు శ్రీనివాసరావు.

**స్వీట్లు పంపిణీ, ర్యాలీతో కూటమి నాయకుల సంబరాలు**



**కలిదిండి, ఏప్రిల్ 2 (వార్తా ప్రభ)** ఆంధ్రుల గుండెచప్పుడు అయిన అమరావతి రాజధాని చట్టబద్ధత బిల్లును నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఉభయ సభలైన లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రవేశపెట్టి ఆమోదించడాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజలకు పండుగ దినంగా రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అండ్రాజు శ్రీనివాసరావు పేర్కొన్నారు. కలిదిండి మండలం మట్టగుంట గ్రామంలో ఈ సందర్భంగా కూటమి నాయకులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. అమరావతి బిల్లుకు కేంద్రంలో ఆమోదం లభించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గ్రామంలో స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామ ప్రధాన కూడలిలో ర్యాలీ నిర్వహించి "ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి" అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బిల్లుకు మద్దతు తెలిపిన అన్ని రాజకీయ పార్టీలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అండ్రాజు దుర్గారావు, ఒడుగు గణపతి, తిరుమలశెట్టి ఈశ్వర పరుశరాముడు, నడకుదిటి గణపతి, దున్నా సత్యనారాయణ, మోకా రామకృష్ణ, మందపాటి పెంటయ్య, కొపనాతి రాము తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజల భవిష్యత్ పై మరింత నమ్మకం పెంచిన అమరావతి బిల్లు

**● రాష్ట్ర మంత్రి వర్యులు కొలుసు పార్థసారథి ● రంగ రంగ వైభవంగా బైక్ ర్యాలీ**



**నూజివీడు/ఏలూరు,ఏప్రిల్ 2 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి పూర్తి చట్టబద్ధత కల్పిస్తూ, లోక్ సభ బిల్లుకు ఆమోదం తెలపడం శుభపరిణామం అన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రివర్యులు కొలుసు పార్థసారధి. ఆదేశాల మేరకు భారీ బైక్ ర్యాలీ చేసిన కూటమి నాయకులు కార్యకర్తలు,మొదటిగా మంత్రి క్యాంపు కార్యాలయం నుండి ర్యాలీ ప్రారంభించి నగరవీధుల్లో ర్యాలీ కొనసాగి బాణా సంచాలతో, రంగ రంగ వైభవంగా సాగిన ర్యాలీ చిన గాంధీ సెంటర్లో ముగిసిన అనంతరం కార్యకర్తలు నాయకులు ఒకరినొకరు స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకొన్న అనంతరం మంత్రి వర్యులు వర్చువల్ లో మాట్లాడుతూ, ఆంధ్ర రాజధాని విషయంలో నెలకొన్న కొంత అనుమానాన్ని తెర తెంచి చట్టబద్ధత రావడం గొప్ప పరిణామం అన్నారు.. అవమానాలకు,ఇబ్బందులకు తావులేకుండా ముగింపు పలుకుతూ బలమైన భవిష్యత్ కు పునాది, బంగారు బాట వేసి, తాజా బిల్లు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చిందని అన్నారు. చరిత్రలో నిలచిపోయే బిల్లు లోక్ సభలో ఆమోదం పొందడంతో రాజధాని కోసం పోరాటం చేసిన ప్రతీ ఒక్క రైతుకు కార్యకర్తల శ్రమకు ఫలితం లభించిందన్నారు. వారందరికీ ఈ విజయాన్ని అంకితం చేయాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వం అప్పుల ఊబిలో నెట్టి వెళ్లిన రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు పరులుగు తీసేందుకు పూర్తి తోడ్పాటు అందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకు, హోంమంత్రి అమిత్ షాకు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లకు ఈ సందర్భంగా మంత్రివర్యులు కొలుసు పార్థసారధి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చరిత్రలో నిలచే బిల్లుకు మద్దతు ఇవ్వకుండా వైసిపి పార్లమెంట్ సభ్యులు. వాకౌట్ చెయ్యడం, వారి మూరక్తత్వాన్ని విద్వంస వైఖరిని స్పష్టం చేసిందని అన్నారు. ప్రపంచ స్థాయి నగరాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్మిస్తూ ఉంటే అమరావతిని స్కాం గా భ్రమరావతిగా జగన్మోహన రెడ్డి అనడం అయన అజ్ఞానాన్ని, తెలియజేస్తుంది అన్నారు. రైతులపై జగన్మోహన్ రెడ్డికి ఉన్న అసూయను స్పష్టం చేస్తోందని. ప్రజలు కూటమితో కలసి అభివృద్ధి వైపు నడవడానికే ఉత్సాహంగా ఉన్నారన్నారు. లోక్ సభ మద్దతుతో మరింత వేగంగా ప్రపంచ స్థాయి రాజధాని అమరావతి త్వరలోనే పూర్తి చేసి రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం అంకితం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జేఎన్టీయుకే 12వ స్నాతకోత్సవం

**కాకినాడ, ఏప్రిల్ 2 (వార్తాప్రభ) :** జవహర్లాల్ నెహ్రూ సాంఘిక విశ్వవిద్యాలయం (జేఎన్టీయూకే)12వ స్నాతకోత్సవ వేడుకలు శుక్రవారం యూనివర్సిటీ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర గవర్నర్, యూనివర్శిటీ చాన్సలర్ ఎస్ అబ్దుల్ నజీర్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గౌరవ డాక్టరేట్లు, గోల్డు మెడల్స్‌ను అర్హులైన వారికి అందజేశారు. స్నాతకోత్సవంలో భాగంగా వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులకు బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, పీహెచ్‌డీ డిగ్రీలు అందజేశారు. విశిష్ట ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రత్యేకంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన గవర్నర్ అబ్దుల్ నజీర్ విద్యార్థులు తమ విద్యను సమాజ సేవకు ఉపయోగించాలని సూచించారు. సాంకేతిక విద్యలో నైపుణ్యం పెంపొందించుకోవడం ద్వారా దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ సిఎస్ ఆర్కె ప్రసాద్ మాట్లాడుతూ యూనివర్శిటీ ఎన్ఎఏసి ఎం గ్రేడ్ సాధించడమే కాకుండా, పలు ఇంజినీరింగ్ కోర్సులకు ఎన్ బిఎ గుర్తింపు పొందిన విషయాన్ని వివరించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం నూతన విద్యా




విధానం (చీజూ–2020) ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శాంతాబయోటిక్ అధినేత డాక్టర్ కేఐ వర ప్రసాద్ రెడ్డికి కళాశాల గౌరవ డాక్టరేట్ను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ పి.సుబ్బారావు, రిజిస్ట్రర్ ఆర్ శ్రీనివాసరావు, ఓఎస్డి డి కోటేశ్వరరావు ప్రొఫెసర్లు,అధికారులు, వివిధ కళాశాల ప్రిన్సిపాల్స్ విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యువత క్రీడల పట్ల ఆసక్తి కలిగి

**● టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి లంక ● కుంటముక్కలలో ముగిసిన క్రికెట్ టోర్నమెంట్**

**● విజేతగా నిలిచిన విజయవాడ భాస్కర్ సిసి జట్టు ● రన్నర్ గా కుంటముక్కల సిసి**

**● విజేతలకు బహుమతులు అందజేసిన లంక నాగేశ్వరరావు**

**జి.కొండూరు,ఏప్రిల్ 2 (వార్తాప్రభ) :** యువత క్రీడల పట్ల ఆసక్తి కలిగి ఉండాలని టీడీపీ జి.కొండూరు మండల ప్రధాన కార్యదర్శి లంక నాగేశ్వరరావు అన్నారు.ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండల పరిధిలోని కుంటముక్కల గ్రామంలో గత నెల మార్చి 15వ తేదీ నుంచి జరుగుతున్న క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. ఈ టోర్నమెంట్లో మూడు జిల్లాలు ఏలూరు జిల్లా,ఎన్టీఆర్ జిల్లా, గుంటూరు జిల్లా నుంచి జట్లు పాల్గొన్నాయి. సాయంత్రం జరిగిన బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి లంక నాగేశ్వరరావు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన గెలుపొందిన జట్లకు అభినందనలు తెలియజేశారు. మొదటి,ద్వితీయ తృతీయ స్థానాలలో నిలిచిన విజేతలకు బహుమతులను అందజేశారు.యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని,క్రీడారంగంలో ఎంతో మంది క్రీడాకారులు తమ ప్రతిభను కనబరిచి ఉన్నత స్థానంలో నిలిచారని తెలియజేశారు.

**టోర్నమెంట్ విజేతగా నిలిచిన విజయవాడ భాస్కర్ సిసి జట్టు:** గురువారం జరిగిన ఫైనల్ లో విజయవాడ భాస్కర్ సిసి,కుంటముక్కల సిసి జట్లు తలపడ్డాయి.ఉత్కంఠంగా జరిగిన పోటీలో విజయవాడ భాస్కర్ సిసి జట్టు గెలుపొందింది. మొదటి స్థానంలో నిలిచినజట్టుకు కుంటముక్కల పిఏసిఎస్ చైర్మన్ సుఖవాస 30,000 రూపాయల



నగదును బహుమతిగా అందించారు.రెండో స్థానంలో నిలిచిన కుంటముక్కల సీసీ జట్టుకు లంక నాగేశ్వరరావు 20,000 రూపాయల నగదు ను బహుమతిగా అందజేశారు.అలాగే మూడో స్థానాన్ని నిలబెట్టుకున్న మడిచర్ల సిసి జట్టుకు లింగాల రాజ్ కోటి రూ.10,000 లు నగదు అందజేశారు.ఈ కార్యక్రమంలో తుమ్మల దుర్గారావు,టోర్నమెంట్ కమిటీ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# అమరావతిబిల్లు పార్లమెంట్ ఆమోదంపై సంబరాలు





**కాకినాడ,ఏప్రిల్ 2 (వార్తాప్రభ) :** ఏపీ రాజధాని అమరావతి విషయంలో నేడు మరో కీలక ఘట్టం ఆవిష్కృతం కాబోతోందని, ఆంధ్ర రాష్ట్రానికి సంబంధించి ఈ రోజు ఒక చారిత్రాత్మక దినంగా నిలిచిపోతుందని కాకినాడ జిల్లా ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షులు వనమాడి మోహన్ వర్మ, నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర పునర్విభజన చట్ట సవరణ బిల్లుకు పార్లమెంట్ లో ఆమోదం లభించిన సందర్భంగా శాసనసభ్యులు వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో మెయిన్ రోడ్, టౌన్ హాల్ సెంటర్ నందు విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ముందుగా సర్వ మత ప్రార్థనలు నిర్వహించి, పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి, మెయిన్ రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించి దారి పొడవునా నగర ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మోహన్ వర్మ, వీరు మాట్లాడుతూ అమరావతి బిల్లు పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందుతుందని, కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే ఇది సాధ్యమైందని, ప్రతిపక్ష నేత జగన్ మోహన్ రెడ్డి గత ఐదేళ్లు రాష్ట్రాన్ని రాజధాని లేకుండా చేశారని, అమరావతి అంటే ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు సెంటిమెంట్ అనీ, అమరావతి పేరు వింటే జగన్‌కు కంపరంగా ఉంటుందనన్నారు. నిత్యం రాజధాని అమరావతిపై విషం కక్కుతున్నారని, అమరావతి అని పలకడానికి కూడా ఇష్టపడక మావిగన్ అని వింత చేష్టలు ప్రవర్తిస్తున్నాడన్నారు. అమరావతి పట్ల ఆయనకున్న ద్వేషం భవిష్యత్తులోనూ మారదని నిన్నటితో మరోసారి స్పష్టమైందని, గత వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి 3 రాజధానులు పేరుతో రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అభివృద్ధి చెందకుండా కుట్రల పన్నాడని, నేడు కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆంధ్ర రాష్ట్ర రాజధానిగా చట్ట సవరణ బిల్లుకు పార్లమెంట్లో ఆమోదం చేయించిందని, ఇప్పుడు ఆంధ్ర రాష్ట్ర ఏకైక రాజధాని నా రాజధాని అమరావతి అని ప్రతి ఒక్కరూ గౌరవంగా చెప్పుకునే రోజు వచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు తుమ్మల రమేష్, బచ్చు శేఖర్, రహీమ్, చింతా పేర్రాజు, పంతాడి రాజు, ఓమ్మి బాలాజీ, బి ఎస్ కృష్ణ, ఎం.విద్యాసాగర్, అన్సర్, గదుల సాయిబాబా, పలివెల రవి అనంత కుమార్, తుమ్మల సునీత, చింతలపూడి రవి, బలసాడి రంగారావు, పినపోతు జీవారత్నం, మండపాక దుర్గాప్రసాద్, సంఘాని సత్యం, పినపోతూ రాము, అంబటి చిన్న, ఓలేటి పాండురంగడు, గాది శివరామకృష్ణ, కోపనాతి నాగ కుమారి, పిర్ల లక్ష్మి ప్రసన్న, మూగు చిన్ని, ముత్యాల అనురాధ, నమ్మి సత్యవాణి, మల్లాడి ఏడుకొండలు, సంఘాని నాగూర్, బలసాడి శ్రీను, పట్టా ధనలక్ష్మి, పాలెపు రాజు, ఆదం సతీష్, పినపోతు సత్తిబాబు, ఎరిపిల్లి రాము, గెడ్డం పూర్ణ చంద్రశేఖర్, అరదాడి శివ, మూగు రాజు, ప్రేమానందం, మోస పేతురు, జొన్నాడ వెంకటరమణ, అంగడి దురారావు, గుజ్జు బాబు, గోపిశెట్టి బూరయ్య, పసుపులేటి వెంకటేశ్వరరావు, పలివేల లక్ష్మి, వీరంరెడ్డి వెంకట్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కామనగరువు అభివృద్ధి ప్రదాత సర్పంచ్ నక్కా అరుణకు ఘన సన్మానం..

**● పదవీ కాలం పూర్తి కావడంతో వీడ్కోలు పలికిన గ్రామస్తులు, సిబ్బంది.. ● ప్రజల మనిషికి గ్రామస్తుల నీరాజనం - సర్పంచ్ అరుణకు ఘన వీడ్కోలు. ● ప్రజల వెంటే ఉంటానన్న సర్పంచ్**



**అమలాపురం,ఏప్రిల్ 2 (వార్తాప్రభ) :** అమలాపురం రూరల్ కామనగరువు గ్రామ పంచాయతీ సర్పంచ్ నక్కా చంద్రశేఖర్ అరుణ పదవీ కాలం నేటితో ముగియడంతో, గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది ఆమెను ఘనంగా సన్మానించారు. గత ఐదేళ్ల కాలంలో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో ఆమె చూపిన చొరవను కొనియాడుతూ ఈ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ తన హయాంలో పంచాయతీకి ప్రత్యేక నిధులు తీసుకువచ్చి, గ్రామంలోని ప్రధాన సమస్యలైన ?అంతర్గత రోడ్ల నిర్మాణం, ?పక్కా డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు,?ప్రజల దాహార్తిని తీర్చేందుకు నూతన వాటర్ ట్యాంకుల నిర్మాణం. వంటి ఎన్నో అభివృద్ధి పనులను విజయవంతంగా పూర్తి చేశారని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అరుణ ని గ్రామస్తులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. సన్మాన అనంతరం సర్పంచ్ నక్కా చంద్రశేఖర్ అరుణ మాట్లాడుతూ.. పదవిలో ఉన్నా లేకపోయినా, రాబోయే రోజుల్లో కూడా గ్రామ ప్రజలందరికీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. సర్పంచ్‌తో పాటు గ్రామ అభివృద్ధిలో పాలుపంచుకున్న వార్డు సభ్యులందరినీ కూడా ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, మరియు గ్రామంలోని మహిళలు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు..

# నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ను కలిసిన ఎఫ్.ఆర్.టి.ఐ నేతలు



**తిరుపతి,ఏప్రిల్ 2 (వార్తాప్రభ) :** న్యూఢిల్లీ నుంచి తిరుపతి వచ్చిన నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ అథారిటీ సాయిని.విజయ భారతి ని, ఫోరం ఫర్ ఆర్ టి ఐ జాతీయ కమిటీ నేత కుప్పాల. అజయ్ ప్రసన్న కుమార్, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్. కరాటే. చంద్ర శేఖర్ రాయల్, నెల్లూరు జిల్లా ఎఫ్ ఆర్ టి ఐ అధ్యక్షులు డాక్టర్ నారాయణ, పెద్దలు,స్వయం సేవకులు కుప్పా రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసినట్లు గూడూరు శ్రీ క్రిష్ణ సేవాసమితి ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్ గురువారం ప్రకటనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ స్వచ్ఛందంగా,ఆర్ టి ఐ యాక్ట్, హ్యూమన్ రైట్స్,లోకాయుక్త చట్టముల మీద సామాన్య ప్రజలకు కూడా అవగాహన పలు మాధ్యమముల ద్వారా కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రజల హక్కులు, విధులను బాధ్యతా యుతంగా పాటించే విధంగా ఉంటూనే,సామాన్య ప్రజల పక్షాన నిలుస్తూ అవినీతి అధికారులును మీద చట్టబద్ధంగా చర్యలు చేపట్టే విధంగా ఆర్ టి ఐ చట్టం ఉపయోగించి, అవినీతి కి వ్యతిరేకంగా కార్యాచరణ చేస్తున్నామన్నారు. ఆంధ్రా,తెలంగాణ, మొదలు రాష్ట్రంలలో కూడా ఎఫ్ ఆర్ టి ఐ సంస్థ, గవర్నమెంట్ తో సమన్వయం చేసుకుంటూ, చేపట్టే విధానాలు చాలా బాగా ఉన్నాయి అని కొనియాడుతూ,ఈ దేశ వ్యాప్తంగా,సమాజంలో,ఎక్కడ ఐనా కుల,మతాలకు అతీతంగా ఎవరి మానవ హక్కులకు భంగం జరిగినా కూడా, రాష్ట్రంలో ఉన్న అథారిటీ దృష్టి కి కానీ, న్యూఢిల్లీలోని తమ కేంద్ర కార్యాలయం శాఖ లోని తమ ఆఫీసు దృష్టికి తీసుకు వస్తే , వెంటనే వారికి న్యాయం జరిగే విధంగా తగు చర్యలు తీసుకుంటామని, ఎఫ్ ఆర్ టి ఐ నేతలకు,నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ అథారిటీ హామీ ఇవ్వటం జరిగిందని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు.

# ఆంధ్రులు గర్వపడే క్షణాలివి...

**● ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఉద్యోగుల తరపున కృతజ్ఞతలు... ● శాశ్వత రాజధానితో అభివృద్ధిలో పురోగతి... ● ఉద్యోగులకు 7000 కోట్ల బకాయిల చెల్లింపు నిర్ణయం హర్షదాయకం**

**● ఏపీ ఎన్జీజీవో అధ్యక్షులు ఎ. విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డివి రమణ**







**విజయవాడ,ఏప్రిల్ 2 (వార్తాప్రభ) :** రాష్ట్ర విభజన తర్వాత రాజధాని అంటూ లేని నూతన రాష్ట్రానికి అమరావతి శాశ్వత రాజధానిగా చట్టబద్ధత కల్పించేందుకు పార్లమెంటు, రాజ్యసభలలో ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందిన ఈ క్షణాలు ప్రతి ఆంధ్రుడు గర్వించదగినవని ఏపీ ఎన్జీజిఓ రాష్ట్ర అధ్యక్షులు ఎ. విద్యాసాగర్ అన్నారు. పార్లమెంటు ఉభయసభల్లో అమరావతి శాశ్వత రాజధానిగా కొనసాగేందుకు ప్రవేశపెట్టిన బిల్లు చట్టబద్ధంగా ఆమోదం పొందడాన్ని పురస్కరించుకొని గురువారం గాంధీనగర్ లోని ఎన్జీజిఓ హోమ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ బిల్లు ఆమోదం పొందేందుకు సంపూర్ణంగా సహకరించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఇతర క్యాబినెట్ మంత్రులు, అమరావతి శాశ్వత రాజధానిగా ఉండాలని మద్దతు పలికిన జాతీయస్థాయి పార్టీ నేతలకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. గత ప్రభుత్వం బకాయి పెట్టిన అనేక విషయాలలో ఉద్యోగులకు సంబంధించిన బకాయిలను 7వేల కోట్ల రూపాయలకు పైగా చెల్లించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్ణయించడం, సానుకూల నిర్ణయాన్ని తీసుకోవడం సంతోషదాయకమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను దశలవారీగా చెల్లిస్తున్నప్పటికీ ఈ చెల్లింపులలో మరింత వేగం పెరగాలని ఉద్యోగులు ఆకాంక్షిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగుల ఆందోళనను అర్థం చేసుకోవడం అభినందనీయమన్నారు. తమ ఆందోళనలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ లు తాజాగా ప్రభుత్వ ఉద్యోగులు చెల్లించాల్సిన బకాయిలలో 7059 కోట్లు విడుదల చేసేందుకు ఆమోదం తెలపడం ఉద్యోగులకు ఒక భారీ ఊరటగా ఉందన్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయనున్న బకాయిలలో భాగంగా గత ప్రభుత్వంలో అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగులు మరియు రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం రూ. 7,059 కోట్లు విడుదల చేయాలని ఆర్థిక శాఖ అధికారులు తెలిపారన్నారు. తాజాగా విడుదల చేయనున్న చెల్లింపులలో జిపిఎఫ్ కింద రూ. 1,847.83 కోట్లు, గ్రాట్యూటీ బకాయిల చెల్లింపుల కోసం రూ. 3,411.03 కోట్లు, రిటైర్ అయిన ఉద్యోగుల లీవ్ ఎన్కాష్మెంట్ కోసం రూ.1,800 కోట్లు, పోలీసు సిబ్బందికి అదనపు సరెండర్ లీవ్ చెల్లింపుల కోసం రూ.223.47 కోట్లు నిధులు విడుదలవుతున్నాయన్నారు. కాగా ఇప్పటికే జిపిఎఫ్ కింద రూ.1,847.83 కోట్లు, గ్రూప్ ఇన్సూరెన్స్ కోసం 76 కోట్లు, జి. ఎల్. ఐ. కింద రూ.76 కోట్ల చెల్లింపులు పూర్తి అయ్యాయని వివరించారు. ఉద్యోగుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధ, ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బకాయిల చెల్లింపుల విషయంలో సానుకూల నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ నిరంతర పోరాటం, నిర్విరామ కృషి, ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు మరియు రాష్ట్ర ప్రభుత్వ సానుకూల వైఖరి కలిసి ఉద్యోగులకు మేలు చేసే దిశగా ముందుకు తీసుకెళ్తున్నాయని వారు పేర్కొన్నారు. ఉద్యోగుల హక్కుల కోసం, ఉద్యోగుల సంక్షేమం కోసం ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర జేఏసీ నాయకులు శ్రీయ విద్యాసాగర్, యుటిఎఫ్ నాయకులు శ్రీ కే ఎస్ ఎస్ ప్రసాద్, ఎస్. టి. యు. నాయకులు సాయి శ్రీనివాస్, ఎ పి టి ఎఫ్ నాయకులు హృదయ రాజు, ఏపీటీఎఫ్ నాయకులు మంజుల, జేఏసీ నాయకులు భారతి ప్రసాద్, జగదీష్ శ్రీనివాస్, హరినాథ్ బాబు రజినిష్ బాబు తదితరులు ముఖ్యమంత్రిని వ్యక్తిగతంగా కలిసి రాజధాని బిల్లుకు పార్లమెంటు స్థానంలో ఆమోదం జరగడం వల్ల హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. దానితోపాటు ఏడువేల కోట్ల విడుదలకు నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి కి జేఏసీ నాయకులు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే పిఆర్సి కమిటీ చైర్మన్ నియామకం, ఉద్యోగులకు సంబంధించిన సరెండర్ లీవులు బిల్లుల చెల్లింపు వంటి వాటిపై కూడా ముఖ్యమంత్రి దృష్టిపెట్టాలని కోరారు.

# కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ శెఖావత్‌ను కలిసిన డా. పి.సి.రాయులు



**తిరుపతి,ఏప్రిల్ 2 (వార్తాప్రభ) :** కేంద్ర రాజభాషా మంత్రిత్వ శాఖ (హిందీ సలహా కమిటీ) సభ్యులు డా. పి. సి. రాయులు, న్యూఢిల్లీలోని తన అధికారిక నివాసంలో కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ శెఖావత్‌ను గురువారం కలిశారు.ఈ సందర్భంగా మంత్రిత్వ శాఖ పరిధిలోని హిందీ సలహా కమిటీలో మూడేళ్ల కాలానికి తనను సభ్యునిగా నామినేట్ చేసినందుకు డా. పి.సి.రాయులు మంత్రి గజేంద్ర సింగ్ శెఖావత్ కి తమ మర్యాదలను, కృతజ్ఞతలను తెలియజేశారు.గౌరవ సూచకంగా మరియు సంప్రదాయంగా, డా. రాయులు మంత్రి గజేంద్ర సింగ్ శెఖావత్‌కి శాలువా కప్పి, శ్రీ బాలాజీ ప్రసాదాన్ని సమర్పించారు.ఈ సమావేశంలో, రాష్ట్ర గొప్ప సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని చాటిచెబుతూ, ఆంధ్రప్రదేశ్‌లో మరిన్ని పర్యాటక ప్రాజెక్టుల అభివృద్ధికి చొరవ తీసుకోవాలని డా. రాయులు కేంద్రమంత్రి ని కోరారు.మంత్రిత్వ శాఖ యొక్క అధికారిక సమాచార ప్రసారాలు మరియు కార్యకలాపాలలో హిందీ అమలును, దాని విస్తృత వినియోగాన్ని ప్రోత్సహించడానికి తాను కట్టుబడి ఉన్నానని డా. రాయులు తెలిపారు.

# అమరావతి బిల్లు ఆమోదం నేపథ్యంలో ర్యాలీ నిర్వహించిన టీడీపీ



**పెడన,ఏప్రిల్ 2 (వార్తాప్రభ) :** అమరావతిని రాజధానిగా పార్లమెంట్ రాజ్యసభలో బిల్లు ఆమోదమై చట్టబద్ధత పొందిన సందర్భంగా టీడీపీ ఆధ్వర్యంలో గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు పెడన బస్టాండ్ ఆంజనేయ స్వామి ఆలయం నుండి తోటమూల ఆంజనేయస్వామి ఆలయం వరకు ఈ ర్యాలీ జరిగింది. శాసనసభ్యులు కాగిత కృష్ణప్రసాద్ ర్యాలీ కి నాయకత్వం వహించారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ హన్ను జెడ్పిటిసి నగేష్ శలపాటి ప్రసాద్ యక్కల శ్యామలయ్య పూలబాబు గఫార్ కాగిత రవిబెజవాడ నాగరాజు ఇతర టీడీపీ నాయకులు పాల్గొన్నారు

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188